ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
7
బుధవారం 30 అక్టోబరు 2024





రైల్వేకోడూరులో బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు జరుగుతున్న పనులు

సిండికేటుతో..

బాణాసంచా ధరలు పైపైకి

- ఖద్దరు అండతో నిబంధనలకు పాతర
- మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు



రైల్వేకోడూరు, అక్టోబరు 29:(ఆంధ్రజ్యోతి) ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో బాణాసంచా దుకాణాల్లో నిబంధనలకు పాతరేస్తున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుండడంతో తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీన్ని ఆసరాగా తీసుకున్న బాణాసంచా లైసెన్సుదారులు సిండి కేటుగా మారి నిబంధనలను గాలికి వదిలేస్తున్నారని రైల్వేకోడూ రులో చర్చ సాగుతోంది. నాసిరకం కంపెనీల బాణాసంచాను విక్రయాలు చేసేందుకు సిద్ధం చేసుకున్నారు. అదే విధంగా దుకాణాలు ఏర్పాటు కాక మునుపే స్టాకు పాయింట్లలో విక్ర యాలు చేస్తున్నారు. సిండికేటుగా మారడంతో బాణాసంచా ధరలనూ అమాంతం పెంచేశారు. వివరాలు ఇలా.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకరికి ఒక్క బాణాసంచా దుకాణం లైసెన్సు మాత్రమే ఇవ్వాల్సి ఉంది. రైల్వేకోడూరులో గత ఏడాది 36 మందికి లైసెన్సు ఇచ్చారు. అయితే.. ఒక వ్యక్తి ఇంటిలో 5, 3, 2 లైసెన్సులు కూడా ఉన్నాయి. అధికారులు సక్రమంగా పరిశీలించకుండానే లైసెన్సులు ఇచ్చారని పలువురు విమర్శిస్తున్నారు. కొందరు లైసెన్సుదారులు వీటిని ఇతరులకు ఇచ్చి కొంత పర్సంటేజీ తీసుకుంటున్నారు. ఈ ఏడాది కూడా ఇదే తంతు సాగుతోందని అంటున్నారు. ఈ వ్యవహారంలో కొందరు ఖద్దరు నేతలు అండగా నిలిచి మా ప్రభుత్వం ఉంది.. మీరు ఏమైనా చేసుకోండి అని హామీ ఇవ్వడంతో బాణాసంచా విక్రయ దారులు రెచ్చిపోతున్నారు. బాణాసంచా దుకాణదారులు అందరూ సిండికేట్‌గా మారి ఇష్టారాజ్యంగా నాసిరకం కంపెనీలవి తెచ్చి వి క్రయాలు చేస్తున్నారని బాహాటంగా చర్చసాగుతోంది. బాణాసంచా దుకాణాలు దీపావళికి ఏర్పాటు చేయాలంటే చాలా నిబంధనలు ఉన్నాయి. మొదట అగ్నిమాపకశాఖ, విద్యుత్, పోలీసు, రెవెన్యూశాఖల అదికారులతో కమిటీ ఉంటుంది. వీరు చెప్పే స్థలంలోనే బాణాసంచా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం రైల్వేకోడూరులో 36 మందికి మాత్రమే లైసెన్సు ఇచ్చారు. రైల్వేకోడూరు మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ పరిధిలోని ఇళ్ల ప్లాట్ల స్థలంలో బాణాసంచా విక్ర యాల ఏర్పా టుకు రెవెన్యూ శాఖాధికారులు అనుమతి ఇచ్చారు. బాణాసంచా దుకాణ యజ మానుల్లో ఇద్దరు వ్యక్తులు కీల కంగా వ్యవహ రించారు. వారికి ఖద్దరు బాబుల అండ ఉంది. భూమి చదును, ప్లానింగ్ తదితరాల కోసం అధి కారులకు ముడుపులు ఇచ్చారని.. అలాగే దుకాణ దారుల దగ్గర నుంచి జీఎస్‌టీ కోసం రూ.10,000, నాలుగు సంతకాల కోసం రూ.16,000, స్థలం బాడుగ తదితర వాటి కోసం రూ.20,000లు వసూలు చేశారని సమాచారం. మొత్తంగా ఒక్కో దుకాణం నుంచి రూ.46,000లు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కీలక పాత్ర పోషిస్తున్న వారు ఈ తతంగాన్ని నడిపిస్తు న్నారు. ఇంత పెద్ద మొత్తంలో ముడుపులు ఇవ్వడంతో దుకాణదారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచి విక్రయాలు సాగించే అవకాశం ఉందని సామాన్యులు వాపోతున్నారు. బాణాసంచా విక్రయాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి.

నిబంధనలు ఇలా

చుట్టుపక్కల నివాసాలు ఉండని విశాలమైన స్థలంలో బాణా సంచా దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలి. ఒక దుకాణానికి మరో దుకాణానికి మధ్య 5 మీటర్లు ఉండాలి. దుకాణం వద్ద ఎలాంటి డెకరేషన్ ఉండరాదు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండడానికి అగ్ని నిరోధక పరికరాలు, రెండు బకెట్ల ఇసుక, 200 లీటర్ల నీటి డ్రమ్ము ప్రతి దుకాణం వద్ద ఉండాలి. కొవిడ్ నిబంధనలు పాటించాలి. చిన్న పిల్లలను దుకాణాల్లోకి రానివ్వ కుండా ఉండాలి. ఫోకస్ లైటింగ్ ఉండరాదు. ఎవరి పేరుపై లైసెన్సు ఉంటుందో ఆ వ్యక్తే దుకాణాన్ని పర్యవేక్షించాలి. మోటారు బైక్‌లు దూరంగా ఉంచాలి. దుకాణాల వద్ద సీసీ కెమెరాలు, వాటర్ పంపు ఏర్పాటు చేసుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారులు ఆదేశించారు. అయితే జిల్లాలో చాలా చోట్ల దుకాణాల వద్ద ఈ ఏర్పాట్లేవీ లేవని అంటున్నారు.

అధికారులు ఏమంటున్నారంటే

బాణాసంచా వ్యాపారుల నుంచి ముడుపులు తీసుకోలేదని అగ్నిమాపక కేంద్రం అధికారి విజయభాస్కర్ తెలిపారు. బాణాసంచా వ్యాపారులందరూ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎవరు నిబంధనలు పాటించకున్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైల్వేకోడూరు సీఐ కే.హేమసుందరరావు మాట్లాడుతూ మామూళ్లు తీసుకోలేదని, అనుకూలమైన వాతావరణంలో బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించాలని దుకాణ దారులకు వివరించామన్నారు. తహశీల్దార్ మహబూబ్‌చాంద్ మాట్లా డుతూ బాణాసంచా దుకాణాలకు అనుకూలమైన స్థలం కావాలంటే అనుమతి ఇచ్చామన్నారు. తాను మూడు రోజులుగా అందుబాటులో లేనని తెలిపారు. విద్యుత్ శాఖ ఏడీ భాస్కర్‌రావు మాట్లాడుతూ దుకాణాలు ఏర్పాటు చేసిన ప్రాంతంలో విద్యుత్ వైర్లు ఉన్నాయా లేవా, దుకాణాలకు సక్రమంగా విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకున్నారా లేదా అనేది మాత్రమే చూస్తామన్నారు. దుకాణదారుల ముఖాలు కూడా తమకు తెలియవని వివరించారు.

జగన్ వద్ద జమ్మలమడుగు పంచాయితీ



- చెరి మూడు మండలాలు చూసుకోవాలంటూ జగన్ తీర్పు
- ఒప్పుకోని మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వర్గం
- కాక లేపుతున్న వైసీపీ రాజకీయాలు

(కడప-ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ సొంత జిల్లాలోనే ఇటీవల జరిగిన ఎన్నికల్లో జనం ఫ్యాను రెక్కలను విరిచేశారు. జనాన్ని పట్టించుకోకుండా ఆయన రివర్స్ పాలన చేశారు. అంతే అదను చూసి ఓటర్లు వాత పెట్టారు. ఐదేళ్ల జగన్ హయాంలో ఒక్క పులివెందులలో తప్ప సొంత జిల్లాకు తన మార్కు డెవలప్‌మెంటు చూపించలేని పరిస్థితి. చివరి రోజుల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా అవి పట్టాలు ఎక్కలేదు. ఉక్కు ఫ్యాక్టరీ ఉత్త ఫ్యాక్టరీగా మారింది. దీంతో ఎన్నికల్లో జనం వైసీపీ బ్యాచ్‌ను ఇంటికే పరిమితం చేశారు. సీఎంగా ఉన్న ఐదేళ్లూ కేవలం వైఎస్ జయంతి, వర్ధంతి, క్రిస్మస్ వేడుకలకు మాత్రమే జగన్ వచ్చేవారు. ఇప్పుడు పార్టీ ఓడిన తరువాత తరచూ ఇడుపులపాయ, పులివెందులకు వస్తున్నారు. పార్టీని చక్కదిద్దే పనిచేస్తున్నారు. మంగళవారం జగన్ ఇడుపులపాయ వచ్చారు. జగన్ ముందుకు జమ్మలమడుగు పంచాయితీ వచ్చింది.

సార్వత్రిక ఎన్నికల్లో కడప పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో పులివెందుల, బద్వేలు మాత్రమే వైసీపీ గెలుచుకుంది. మిగతా అన్ని స్థానాలను టీడీపీ, జనసేన అభ్యర్థులు గెలుచుకున్నారు. ఈ పరాజయాన్ని వైసీపీ నేతలు ఊహించలేకపోయారు. 30 ఏళ్ల తామే అధికారంలో ఉంటామనే దొమ్మ ధైర్యంతో భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు, పనికిరాని మాటలతో జనాలకు దూరమయ్యారు. ఇప్పుడు పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. జిల్లాలో జమ్మలమడుగు నియోజకవర్గం ప్రత్యేకమైనది. కీలకమైన ఫ్యాక్షన్ ఏరియా. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వర్గీయుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయికి వెళ్లింది. జగన్ పార్టీ పెట్టిన తరువాత సుధీర్‌రెడ్డి హార్డ్‌కోర్ కార్యకర్తగా పని చేశారు. ఎమ్మెల్యేగా గెలిచారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రామసుబ్బారెడ్డి వైసీపీలో చేరారు. అయితే ఇరు వర్గాల మధ్య సఖ్యత లేదు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే ఇరువురు ఎడముఖం పెడముఖంగా ఉన్నారు. నిన్న జరిగిన ఎన్నికల్లో సుధీర్‌రెడ్డి ఓడిపోయారు. ప్రస్తుతం అక్కడే ఇన్‌చార్జిగా ఉంటున్నారు. ఏడాది క్రితం రామసుబ్బారెడ్డికి ఎమ్మెల్సీ ఇచ్చారు. రామసుబ్బారెడ్డి వైసీపీలో చేరినప్పటి నుంచి కూడా ఈ ఇద్దరి వర్గాల మధ్య ఉప్పు నిప్పుగా ఉంది. ఇటీవల మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తీరుపై జగన్‌కు ఫిర్యాదులు వచ్చాయంటారు. జమ్మలమడుగు ఇన్‌చార్జికి సంబంధించి పదిరోజుల క్రితం జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి అధ్యక్షతన జిల్లాలోని వైసీపీ ముఖ్యనేతలు భేటీ అయ్యారని అంటారు. ఆ భేటీలో ఇన్‌చార్జిని మార్చే విషయం గురించి చర్చ జరిగినా నిర్ణయం జగన్‌కే వదిలేశారని సమాచారం. ఈ నేపథ్యంలో మంగళవారం ఇడుపులపాయలో జగన్ జమ్మలమడుగు జగడంపై దృష్టి సారించారంటారు. మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతో జగన్ సుదీర్ఘంగా రెండుగంటల పాటు మాట్లాడారని అంటున్నారు. అయితే ఇద్దరూ కూడా ఎవరి వాదన వారు వినిపించారని సమాచారం. చివరకు జగన్ మధ్యేమార్గంగా.. జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాలను ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డికి అప్పజెప్పగా.. ఎర్రగుంట్ల, ముద్దనూరు, కొండాపురం మండలాల బాధ్యతను మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చూసుకోవాలని చెప్పారంటారు. అయితే ఈ ప్రతిపాదనను సుధీర్‌రెడ్డి తిరస్కరించి మీటింగ్ సమయంలోనే బయటికి వచ్చారని అంటున్నారు. జగన్ పంచాయితీ చేసినా జమ్మలమడుగు జగడం తేలకపోవడం చూసి ఆ పార్టీ నేతలే ఆశ్చర్యపోతున్నారు.

మళ్లీ మంచిరోజులు వస్తాయ్.. అధైర్యపడొద్దు

- ప్రజాదర్బార్‌లో జగన్

పులివెందుల/ వేంపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మళ్లీ మంచి రోజులు వస్తాయ్ ఎవరూ అధైర్యపడొద్దని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా జగన్ పులివెందులకు వచ్చారు. మంగళవారం బెంగళూరు నుంచి హెలికాప్టర్ ద్వారా బయలుదేరి ఉదయం 11.30గంటల ప్రాంతంలో ఇడుపులపాయకు చేరుకున్నారు. అక్కడ ఆయన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఘాట్‌కు చేరుకొని నివాళులు అర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులతో మాట్లాడారు. వేంపల్లెకు రోడ్డుమార్గన చేరుకుని అక్కడ పలువురి నాయకుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. 4గంటల ప్రాంతంలో పులివెందులకు చేరుకున్నారు. క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వారివారి వ్యక్తిగత సమస్యలను ఆయనకు విన్నవించారు. ఎవరు అధైర్యపడద్దని త్వరలోనే మంచిరోజులు వస్తాయని ఆయన వారికి భరోసా ఇచ్చారు. సెల్ఫీలు, పలకరింపులతో ఆయన ప్రజాదర్బార్ కార్యక్రమం సాగింది. రాత్రి 8గంటల వరకు ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేంపల్లె నుంచి పులివెందులకు వస్తున్న మార్గమధ్యంలో జగన్ మెడికల్ కళాశాల వద్ద వాహనాన్ని సెల్ఫీ దిగారు. బుధవారం పులివెందులలోని క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్‌లో పాల్గొంటారని వైసీపీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.



పులివెందుల మెడికల్ కళాశాల వద్ద సెల్ఫీ దిగుతున్న వైఎస్ జగన్

వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పాఠశాలల ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా డీఈవో వెబ్‌సైట్‌లో పొందుపరిచామని డీఈవో యు.మీనాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలుంటే నవంబరు 1వతేదీ సాయంత్రం 5గంటలోపు రాత పూర్వకంగా తగిన ఆధారాలతో డీఈవో కార్యాలయంలో సమర్పించాలని కోరారు. పాఠశాల విద్య ఆదేశాల మేరకు కడప మున్సిపల్ కార్పొరేషన్, ప్రొద్దుటూరు మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీలకు, స్కూలు అసిస్టెంట్లకు పదోన్నతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సీనియారిటీ జాబితాను డీఈవో వెబ్‌సైట్‌లో పొందుపరిచామని వివరించారు.

అందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

- ఇన్‌చార్జ్ కలెక్టర్ అదితి సింగ్



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ అదితి సింగ్

కడపరూరల్, అక్టోబర్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరక్షరాస్యులందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ అదితి సింగ్ పేర్కొన్నారు. మంగళవారం జడ్పీ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీలో అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ (ఉల్లాస్) పథకంపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో 100 శాతం అక్షరాస్యత సాధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఉల్లాస్ పథకాన్ని అమలు చేస్తున్నాయన్నారు. 15 ఏళ్ల అంతకంటే ఎక్కువ వయస్సు ఉండి చదువు ఆపేసిన లేక చదువుకోని పెద్దలను గుర్తించి వారికి ప్రాథమిక విద్య, డిజిటల్ విద్య, ఆర్థిక విద్యను వలంటీర్ ద్వారా అందించడమే ఉల్లాస్ పథకం లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 23,170 మంది నిరక్షరాస్యులను గుర్తించాలని నిర్దేశించామన్నారు. ముఖ్యంగా స్వయంసహాయక సంఘాల మహిళలు, అంగన్‌వాడీ ఆయాలు, హెల్పర్స్, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే నైట్ వాచ్‌మెన్‌లు తదితరులపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ పథకం ద్వారా గుర్తించిన వారికి నవంబర్ 5 నుంచి 2025 మార్చి 15 వరకు ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, జీవన నైపుణ్యాలు, వృత్తి నైపుణ్యాలు, ప్రాథమిక విద్య, నిరంతర విద్య వంటి అంశాలపై శిక్షణ ఇవ్వాలన్నారు. శిక్షణ తరగతులు పూర్తి చేసుకున్న వారికి 2025 మార్చి నెలలో అసెస్మెంట్ టెస్ట్ నిర్వహించి అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి ఓపెన్ స్కూల్ ద్వారా సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. జడ్పీ సీఈవో ఓబులమ్మ, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీలు ఆనంద్‌నాయక్, శ్రీలక్ష్మి, వయోజన విద్యాశాఖ డీడీ ఎంవీ సుబ్బారెడ్డి, జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి సుబ్రమణ్యం, ఉల్లాస్ పథకం నిర్వాహకులు తదితరులు మాట్లాడారు.

2న జడ్పీ స్థాయి కమిటీల సమావేశం

జిల్లా పరిషత్ స్థాయి కమిటీల సమావేశాన్ని నవంబరు 2న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీల అధ్యక్షులు, సభ్యులు, అధికారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

1న పింఛన్లు వందశాతం పంపిణీ చేయాలి

కడప కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీ నవంబరు 1వ తేదీనే వందశాతం జరగాలని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను మంగళవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. 31వ తేదీన దీపావళి పండుగ ఉన్నందున 30వ తేదీన సంబంధిత బ్యాంకు బ్రాంచ్‌ల నుంచి డబ్బు డ్రా చేసుకుని సొమ్ము జాగ్రత్తగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 1వ తేదీ శుక్రవారం ఉదయం 5-30 గంటలకే సంబంధిత సిబ్బంది అందరూ వారికి కేటాయించిన గ్రామాలకు చేరుకుని ఉదయం 6 గంటలలోగా పంపిణీ ప్రారంభించాలని ఆదేశించారు. పింఛన్ మొత్తం డ్రా చేయడంలో, పంపిణీలో ఏమైనా సమస్యలు ఉంటే వాట్సాప్ గ్రూపుల ద్వారా వెంటనే తెలియజేయాలని సూచించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : ఎస్పీ

కడప క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించి ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకుని విధులను మరింత సమర్థవంతంగా నిర్వర్తించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆకాంక్షించారు. మంగళవారం స్థానిక పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో స్టేషన్ల ఎస్‌ఐలు, రైటర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉన్నతాధికారులకు వారు కోరిన సమాచారాన్ని నాణ్యత, కచ్చితత్వంతో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులు ఇతర ఫిర్యాదులను విచారించి ఇచ్చే నివేదికలు, ఉన్నతాధికారులు ఇచ్చే మెమోలకు ప్రత్యుత్తరాలు నిర్దిష్ట ప్రమాణాల మేరకు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోజువారి డీఎస్‌ఆర్‌లో ఏయే వివరాలు పొందుపరచాలో సిబ్బందికి ఎస్పీ వివరించారు. కృత్రిమ మేధను వినియోగించుకుని అతి తక్కువ సమయంలో నాణ్యతతో కూడిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు ఎలా అందించాలో ఎస్పీ సిబ్బందికి ఉదాహరణలతో వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బి ఇన్స్‌పెక్టర్ భాస్కర్‌రెడ్డి, కోర్టుమానిటరింగ్ సెల్ ఇన్‌ఛార్జ్ ఇన్స్‌పెక్టర్ వినయ్‌కుమార్‌రెడ్డి, ఫ్యాక్షన్ జోన్ సీఐ పుల్లయ్య, డీటీఆర్‌బీ సీఐ మహ్మద్‌బాబా, చెన్నూరు సీఐ పురుషోత్తంరాజు, జిల్లాలోని స్టేషన్ల ఎస్‌ఐలు, రైటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఐటి కోర్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు కృషిచేయండి

- ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047 ఆశయ సాధనలో భాగంగా ఐదేళ్ల జిల్లా విజన్ ప్లాన్ లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా విజన్ ప్రణాళిక రూపకల్పనపై డీఆర్వో గంగాధర్ గౌడ్‌తో కలసి అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ప్రాధాన్యతా విభాగాల్లోని అన్ని శాఖలపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా విజన్ ప్లాన్ రూపకల్పన చేసుకుని రానున్న ఐదేళ్లు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నారు. జిల్లా ఆర్థికాభివృద్ధి, తలసరి ఆదాయం పెంచేలా కీలకమైన శాఖలన్నీ సహాయ సహకారాలు అందిపుచ్చుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, సీపీఓ వెంకట్రావు, డీఎఫ్‌వో శివకుమార్, డీపీఓ రాజ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రేపే దీపావళి

- జోరందుకున్న ప్రమిదల విక్రయాలు
- తెరచుకున్న బాణాసంచా దుకాణాలు

కడప కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అన్ని పండుగల్లోకీ దీపావళి ప్రత్యేకమైనది. పెద్ద, చిన్న అనే తేడా లేకుండా ఇంటిల్లిపాది ఆనందకర వాతావరణంలో సంబరాలు జరుపుకుంటారు. పెద్దలు సైతం పిల్లలతో పోటీ పడి మరీ టపాసులు కాల్చి చిన్నపిల్లలుగా మారుతారు. 31వ తేదీ గురువారం దీపావళి పర్వదినానికి యావత్ జిల్లాలోని ప్రజలు సంసిద్ధులు అవుతున్నారు. పండుగను క్యాష్ చేసుకునేందుకు ఇప్పటికే వ్యాపార సంస్థలు పోటీ పడుతున్నాయి. క్యాష్‌బుక్ ఆఫర్, డిస్కౌంట్స్‌తో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నాలు జోరందుకున్నాయి. ప్రధానంగా మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, వస్త్రదుకాణాలు, బంగారు నగల దుకాణాలు, వినియోగదారులను ఆకట్టుకునేందుకు పోటీ పడుతున్నాయి.



ప్రమిదల విక్రయాలు

కార్తీక మాసంలో వచ్చే మొదటి పర్వదినం దీపావళి. ప్రతి ఇంటిముందు దీపాల వరుసలు ఏర్పాటుచేసి ఆ దీప కాంతులలో టపాసులు కాల్చి పండుగను ఆనందకరంగా జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో ప్రమిదలు, జ్యోతుల విక్రయాలు జోరందుకున్నాయి. దీపాన్ని సాక్షాత్తు లక్ష్మీ స్వరూపంగా యావత్ భారతీయులు భావిస్తారు. వివిధ ఆకృతుల్లో తీర్చిదిద్దిన అందమైన మట్టి ప్రమిదలను నగరంలోని వివిధ కూడళ్లలో అందుబాటులో ఉన్నాయి. వాటి కొనుగోలుతో సందడిగా మారింది. ఇక ఇప్పటికే జిల్లాలోని పలుచోట్ల బాణాసంచా విక్రయాను ప్రారంభించారు.


ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

- బాలుర విజేత కడప జట్టు
- బాలికల విజేత చిత్తూరు జట్టు

8



అండర్-17 కబడ్డీ బాలుర విభాగంలో రాష్ట్రస్థాయి విజేతగా నిలిచిన కడప జట్టు



అపురూపం.. ఆదిమానవుడి రేఖా చిత్రాలు

- 25వేల ఏళ్ల నాటి ఆదిమానవుని ఆనవాళ్ళ
- చింతకుంట కొండలో పెరుగుతున్న సందర్శకుల సందడి
- రక్షణ కల్పించలేని పర్యాటక, పురావస్తు శాఖలు

8



ఆదిమానవుడు చిత్రీకరించిన రేఖాచిత్రాలు

అపురూపాలు ఆదిమానవుడి రేఖాచిత్రాలు



25వేల ఏళ్ల నాటి ఆదిమానవుని ఆనవాళ్లు ● చింతకుంట కొండలో పెరుగుతున్న సందర్శకుల సందడి


రక్షణ కల్పించలేని పర్యాటక, పురావస్తు శాఖలు ● రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాలంటున్న పర్యాటకులు

ముద్దనూరు అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): ఎంతో అరుదైన, అపురూపమైన ఆదిమానవుడు రేఖా చిత్రాలు చింతకుంట కొండలో కనువిందు చేస్తున్నాయి. 25 వేల ఏళ్ల కిందట ఇక్కడ మానవులు ఆవాసం ఏర్పరచుకున్నారని, జీవించారని, కొండపై చిత్రించిన రేఖా చిత్రాలు ఆధారభూతమై నిలుస్తున్నాయి. ఇక్కడి వాతావరణం, నీరు, ఆహారం పుష్కలంగా ఉండడంతో ఆదిమానవుడు ఆవాసానికి అనువైన ప్రదేశంగా ఎంచుకుని నివసించి ఉంటారని దాదాపు 200 రేఖాచిత్రాలను తిలకించిన మేధావులు అభిప్రాయపడుతున్నారు. వీరు ఏర్పాటు చేసుకున్న నివాస ప్రదేశాల ఆచూకీ తెలుసుకునేందుకు అనువుగా అక్కడక్కడా ఎరుపు రంగు ఆకుపసరుతో బాణం గుర్తులను ఏర్పాటు చేసుకున్నారని అంటున్నారు. ఈరేఖా చిత్రాల ఆధారంగా ఆదిమానవుడు దాదాపు 12 అడుగుల ఎత్తు ఉండవచ్చని, కొండలో ఇంకా గాలిస్తే ఎన్నో ఆనవాళ్లు లభించే అవకాశం వుందని అంటున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ కనబరిస్తే ఆదిమానవుడి ఆనవాళ్లు మరెన్నో గుర్తించవచ్చు. వివరాల్లోకెళితే....

నాటి చరిత్ర, నేటి యువతరానికి ప్రతీకలు, శతాబ్ధాలు దాటిన ప్రతి ఆనవాళ్లు చరిత్రకు ప్రతీకగా, అపురూపంగా భావించి, వాటి అభివృద్ధి, రక్షణ కోసం పర్యాటక, పురావస్తు శాఖలను ఏర్పాటు చేశారు. కోతి [illegible]

ఆదిమానవుడు రూపాంతరం చెందుతూ నేడు మనిషిగా మనుగడ కొనసాగిస్తున్నాడు. అటు వంటి ఎంతో పురాతన చరిత్ర కలిగిన 25వేల ఏళ్ల నాటి ఆదిమానవుడి ఆనవాళ్లు ఉన్న రేఖాచిత్రాలను, తిలకించేందుకు వచ్చే సందర్శకులకు చింతకుంట కొండలో రక్షణ కరువైందన్న విమర్శలు వస్తున్నాయి.

చింతకుంట పంచాయతీలోని కొండలు ఎంతో ఆహ్లాదకరంగా ఉన్నాయి. కొండపై నెలకొన్న కోనలింగేశ్వరస్వామి(శివాలయం), సమీపంలోనే 1909 బ్రిటీషర్లు ఏర్పాటు చేసిన విశాలమైన జలాశయాన్ని తలపిస్తున్న చింతకుంట చెరువు. ఈప్రదేశంలో నెలకొన్న ప్రతి ఒక్కటీ చరిత్రను సృష్టిస్తున్నాయి. 2010 ఆగస్టు 17న అప్పటి ఎంపీడీఓ మొగిలిచెండు సురేష్, వివేకవర్థిని జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకులు పుల్లారెడ్డి, కడప ఇన్‌టాక్ లైఫ్‌మెంబర్, అప్పటి జిల్లా కన్వీనర్ సీతారామయ్య, అప్పటి ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా అధికారి సత్యం కొందరు పత్రికా విలేకరుల సహకారంతో ఆది మానవుడి ఆనవాళ్ల కోసం కొండలో గాలించి ఆదిమానవుడి రేఖాచిత్రాలను వెలుగులోకి తెచ్చారు. ఎద్దుల ఆవులగుండు, గొడుగుగుండు, చిన్నావిడగుండు, పెద్దావిడ గుండు, మారెమ్మగుండు, గనంగుండు, మబ్బుగుండు, చిలకలోల్లగుండు ఇంకా ఎన్నో గుండ్ల పై ఆదిమానవుడు నాటి నాగరికత, పనిముట్లు, జంతువుల రేఖాచిత్రాలను కొండరాళ్లకు ఆకు పసరుతో నేటి యుగానికి కనువిందు చేసేలా చిత్రించాడు. ఏనుగు, జింక, దుప్పి, నక్క, కుందేలు, పక్షులు, ఎద్దు, విల్లంబులు ఎక్కుపెట్టిన మానవాకృతులు, అప్పటి వేటకు ఉపయోగించే పనిముట్లు, లైంగిక చిత్రాలు, దాదాపు 200 రేఖాచిత్రాలు కనిపిస్తాయి. ఈరేఖాచిత్రాలను తిలకించిన మేధావులు ఆది మానవుడు నివాసానికి అనువైన ప్రదేశంగా ఎంచుకుని ఆవాసం ఏర్పరచుకుని ఉంటారని అంటున్నారు. ఈరేఖా చిత్రాల ఆధారంగా ఆది మానవులు ఎక్కువ సంఖ్యలో ఉండి వుంటారని తెలుస్తోంది. అంతే కాకుండా ఇక్కడ వారి నివాసాలను గుర్తించేందుకు అనువుగా ఎరుపు రంగుతో బాణం గుర్తులను ఏర్పాటు చేసుకున్నారని అంటున్నారు. అంతేకాకుండా వారు మరణిస్తే మృతదేహం పట్టేలా రాతి గుండును మలిచి మృతదేహాన్ని దానిలో పడుకోబెట్టి సీసంతో నింపి అంత్యక్రియలు చేసేవారని వివరిస్తున్నారు. ఈప్రదేశంలో అటువంటి శ్మశానవాటిక ఉండవచ్చని వెదికితే గుర్తించవచ్చని అంటున్నారు. కొండలో గాలిస్తే మరెన్నో ఆనవాళ్లు లభించే అవకాశం వుందని, ఇటువంటి వాటిని గుర్తించి వాటిని భద్రపరిస్తే చరిత్రకు ఆనవాళ్లుగా నిలుస్తాయని అంటున్నారు. రేఖాచిత్రాలు వెలుగు చూసిన తరువాత ఈ ప్రదేశాన్ని ఎందరో సందర్శనార్థం వస్తున్నారు. కొండపైకి వెళ్లాలంటే దారి సరిగాలేకపోవడంతో 2010లో ఉపాధి పథకంలో భాగంగా పర్యాటకుల కోసం అప్పటి ఎంపీడీఓ మొగిలిచెండు సురేష్ గ్రావెల్ రోడ్డును ఏర్పాటు చేయించారు. 2010 ఆగస్టు24న అప్పటి డీపీఆర్ఓ ప్రసాద్, యోగివేమన యూనివర్సిటీ ప్రొఫెసర్లు సాంబశివారెడ్డి, రామబ్రహ్మం విద్యార్థులతో కలిసి సందర్శించారు. తరువాత 2011 ఫిబ్రవరి19న అప్పటి డీపీఆర్ఓ గోపాల కొండలోని అన్ని గుండ్లకు ఉన్న రేఖా చిత్రాలను సందర్శించారు. అప్పట్లో జమ్మలమడుగు న్యాయమూర్తి, న్యాయవాదులు, ఆర్టీపీపీ ఉద్యోగులు రేఖాచిత్రాలను సందర్శించారు. మనరాష్ట్రం విద్యార్థులే కాకుండా కర్నాటక రాష్ట్రం నుంచి విద్యార్థులు సందర్శనార్థం వస్తూనే వున్నారు. ఆతర్వాత 6వతరగతి సాంఘిక శాస్త్రంలో ఆహార సేకరణ నుంచి ఆహార ఉత్పత్తి వరకు ఆదిమానవుడు పాఠ్యాంశంలో రచయిత, ప్రస్తుతం సంబేపల్లె హెచ్‌ఎం మడితాటి నరసింహారెడ్డి పొందుపరి చారు. దీంతో ఈ ప్రదేశంపై రాష్ట్ర విద్యార్థులు తెలుసుకునే అవకాశం కలిగింది. ఎంతో చరిత్ర కలిగిన ఆదిమానవుడి రేఖాచిత్రాలకు పర్యాటక, పురావస్తు శాఖ వారు రక్షణ కల్పించలేకపోతున్నారు. అప్పట్లో సందర్శనార్థం వచ్చిన కడప అక్షర పాఠశాల విద్యార్థులపై తేనెటీగల దాడి చేశాయి. అయినా అధికారులు స్పందించక పోవడం గమనార్హం. ఇప్పటికైనా సందర్శకులకు రక్షణ కల్పించ వలసిన అవసరం ఎంతైనా వుంది.



రేఖాచిత్రాల అన్వేషణ కోసం మొదటగా వెళుతున్న ఇన్‌టాక్ సభ్యులు, యోగివేమన ప్రొఫెసర్లు,పర్యాటకశాఖ, అధికారులు, ఎంపీడీఓ - గొడుగు గుండు - మబ్బు గుండులో అప్పటి డీఆర్‌డీఏ పీడీ, పర్యాటకశాఖ గోపాల్, ఎంపీడీఓ మొగిలిచెండు సురేష్

వాల్మీకిపురంలో యువకుడి హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

వాల్మీకిపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ కాలనీలో సోమవారం రాత్రి జరిగిన కుటుంబ గొడవలో అజయ్ కత్తితో పొడవడంతో రమేష్(35) అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ ప్రసాద్‌బాబు కథనం మేరకు వివరాల్లోకెళితే...

రమేష్ గుర్కా, కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. తల్లి, తండ్రి తమ్ముడు పిల్లలతో ఉమ్మడిగా కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. రమేష్ నిత్యం మద్యం తాగి ఇంటికి వచ్చి అందరినీ వేధిస్తుండేవాడు. సోమవారం రాత్రి రమేష్ మద్యం తాగి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను దుర్భాషలాడుతూ గొడవకు దిగాడు. కుటుంబీకులను దూషిస్తుండడంతో సహించలేక అడ్డుకునేందుకు యత్నించిన రమేష్ అన్న కుమారుడు అజయ్‌పై దాడి చేశాడు. దీంతో అజయ్ కత్తితో పొడవడంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐ ప్రసాద్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితుడు అజయ్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ...!

- రైతులను చూసి పారిపోయిన దుండగులు



ధ్వంసం చేసిన బీరువా

గుర్రంకొండ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణానికి సమీప ఓనిలోని ఆంజనేయస్వామి ఆలయంలో దుండగులు చోరీకి యత్నించారు. పొలాలకు నీరు పారించడానికి వచ్చిన రైతులను చూసి దుండగులు పరారైనట్లు తెలిసింది. స్థానికుల కథనం మేరకు పట్టణానికి కూత వేటు దూరంలో ఓనిలో చాలా పురాతనమైన ఆంజనేయస్వామి ఆలయం ఉంది. కాగా తెల్లవారు ఝామున కొందరు దుండగులు ఆలయం తాళాలను పగలకొట్టి లోపలికి ప్రవేశించి ఆలయం బీరువాను ధ్వంసం చేశారు. అనంతరం స్వామి వారికి ఏర్పాటు చేసిన వెండి మకరతోరణాన్ని ధ్వంసం చేసి గోనె సంచిలో ఉంచారు. హుండీని కూడా పగలకొట్టి అందులోని సొమ్ము చోరీ చేశారు. ఆ సమయంలో రైతులు పొలాల వద్దకు వస్తున్నట్లు గమనించిన దుండగులు చోరీ చేయడానికి తెచ్చిన కత్తి, ఇతర పరికరాలను అక్కడే వదిలి పరారైనట్లు రైతులు చెబుతున్నారు. విషయాన్ని ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు తెలపడంతో ఘటనా స్థలానికి వెళ్లి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. నిందితులను కనిపెట్టి తగు చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మధురామచంద్రుడు తెలిపారు.

భూఆక్రమణదారులపై కేసులు నమోదు



ఆక్రమణ దారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

అట్లూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నల్లాయపల్లె భూములను ఆక్రమించబోయిన పలువురిని బైండోవర్ చేసుకున్నట్లు డిప్యూటీ తహసీల్దారు శిరీషా తెలిపారు. బద్వేలు మండలానికి చెందిన ఉదయగిరి సుభాన్‌బాషా, ధర్మశెట్టి వెంకటసుబ్బయ్య మరో 30 మందితో మంగళవారం ప్రభుత్వ భూమి ఆక్రమించేందుకు యత్నించి స్తంభాలు పాతి కంచె వేసేందుకు ప్రయత్నించారు. రెవెన్యూ అధికారులకు సమాచారం తెలియడంతో డిప్యూటీ తహసీల్దారు శిరీషా, అట్లూరు ఎస్‌ఐ రామకృష్ణ ఆక్రమిత స్థలానికి చేరుకుని ఆక్రమణదారులను అదుపులోకి తీసుకుని వారిని బైండోవర్ చేసినట్లు డిప్యూటీ తహసీల్దారు తెలిపారు. ఎవరైనా నల్లాయపల్లె భూములను ఆక్రమించేందుకు యత్నించినా కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ఆర్ఐ రమణ, వీఆర్వో సుబ్బయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం



వెనుకజలాలను పరిశీలిస్తున్న డీఎఫ్ఓ

ఒంటిమిట్ట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లర్లను అణచివేస్తామని కడప డీఎఫ్ఓ వినీత్‌కుమార్ హెచ్చరించారు. సోమశిల వెనుక జలాలను పరిశీలించిన ఆయన ఫారెస్ట్ పరిధిలో అనుమతి లేకుండా ఎవరూ సంచరించకూడదని, నిషేధిత ప్రాంతంలోకి అనుమతి లేకుండా ఎవరు వెళ్లినా చర్యలు తీసుకుంటామన్నారు. వన్య ప్రాణులకు తాగునీటి కల్పనపై అధికారులకు సూచనలిచ్చారు. అభివృద్ధి పనులను అవినీతికి తావులేకుండా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్ ప్రణీతి, ఎఫ్ఎస్ఓ బ్రహ్మయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

● రాష్ట్ర స్థాయిలో బాలుర విజేత కడప ● బాలికల విజేత చిత్తూరు జట్టు



అండర్-17 కబడ్డీ బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి విజేతగా నిలిచిన చిత్తూరు జట్టు - హాజరైన వివిధ జిల్లాల క్రీడాకారులు

రాయచోటిటౌన్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పాఠశాల విద్యాశాఖ పర్యవేక్షణలో స్కూల్ గేమ్స్ ఫెడ రేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో అట్టహాసంగా సాగిన అండర్-17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. కబడ్డీపోటీల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమానికి హాజరైన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు, టీడీపీ యువనేత డాక్టర్ మండి పల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. తమ సోదరుడు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో పట్టణంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఐపీఈ భానుమూర్తిరాజు మాట్లాడుతూ అండర్-17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు రాయచోటి ఆతిధ్యం ఇవ్వడం ఆనందంగా ఉంద న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వచ్చిన 26 జట్ల బాల బాలికల క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర స్థాయికి ఎంపికకావడం సంతోషంగా ఉందన్నారు. డీఈఓ సుబ్రమణ్యం మాట్లాడుతూ విద్యార్థులకు చదు వే కాకుండా క్రీడలు కూడా చాలా అవసరం అన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం ఏర్పడుతుందన్నారు.

అనంతరం బాలుర విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన కడప జిల్లా జట్టుకు రూ.25 వేలు, బాలికల విభాగం మొదటి స్థానంలో నిలిచిన చిత్తూరు జిల్లా జట్టుకు రూ.25 వేలు, బాలుర విభాగం రెండో స్థానంలో నిలిచిన అనంతపురం జట్టుకు రూ.15 వేలు, బాలికల విభాగం రెండో స్థానంలో నిలిచిన శ్రీకాకుళం జట్టుకు రూ.15 వేలు, బాలుర విభాగంలో మూడో స్థానంలో నిలిచిన కర్నూలు జట్టుకు రూ.10 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన చిత్తూరు జట్టుకు రూ.10 వేలు, బాలికల విభాగంలో మూడో స్థానంలో నిలిచిన అనం తపురం జిల్లా జట్టుకు రూ.10 వేలు, కృష్ణా జిల్లా జట్టుకు రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేసి అభినం దించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ సెక్రటరీలు వసంత, అరుణ కుమారి, కబడ్డీ పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరాంజనేయులు, ఉపాధ్యాయ సంఘం చీఫ్ పాటర్న్ నరసరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర జట్టుకు ఎంపికైన బాలబాలికలు వీరే

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో మూడు రోజులు పాటు జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి జట్లకు బాలబాలికలను ఎంపిక చేశారు. ఈ జట్లు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాయి.

బాలుర జట్టు: నూర్‌బాషా, బ్రహ్మయ్య, మద్దిలేటి స్వామి (కడప), విష్ణు (అనంతపురం), ఎస్ఎస్‌జాన్ పీటర్ (చిత్తూరు), బటీ గుర్రప్ప (కర్నూల్), రామకృష్ణ (ప్రకాశం), పవన్‌కల్యాణ్ రెడ్డి(గుంటూరు), బీహెచ్ తీషిత్ (కృష్ణ), గంగరాజు (విజయనగరం), సోమేశ్ (ప్రకాశం), దామోదర్‌నాయుడు (కడప), లీలాధర్ (కర్నూలు), సందీప్ (చిత్తూరు).

బాలికల జట్టు: లిఖిత, సనా (చిత్తూరు), యమున (శ్రీకాకుళం), అర్చన (శ్రీకాకుళం), హిమజ, నవ్య(అనంతపురం), కీర్తన (కృష్ణ), శిరీష (కర్నూలు), దేవికాబాయి (గుంటూరు), లక్ష్మిదేవి (విజయనగరం), దివ్య(విశాఖపట్నం), రెడ్డికావ్యశ్రీ (కడప), త్రిపుర (ప్రకాశం), జ్యోతి (కృష్ణ), పల్లవి (చిత్తూరు).

బి.కొత్తకోటలో రెండు గంటలు హైరానా

కుటుంబ సమస్యలతో వాటర్‌ట్యాంక్ ఎక్కిన కార్మికుడు ● ప్రాణాలు కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

బి.కొత్తకోట, అక్టోబరు(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుడు పోలీసులు, ప్రజలను రెండు గంటలపాటు హైరానా పట్టించాడు. స్థానిక ఎస్సీ కాలనీ వాసి కార్మికుడు కోగర శ్రీనివాసులు సాయంత్రం జ్యోతిసర్కిల్‌లో ఉన్న 60 అడుగుల ఎత్తైన వాటర్ ట్యాంకును ఎక్కాడు. ట్యాంక్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకోబోతున్నానని పలువురికి ఫోన్ చేశాడు. విషయం తెలియడంతో శ్రీనివాసులు భార్య శిరీష, ముగ్గురు పిల్లలు, సీఐ రాజారెడ్డి, సిబ్బంది ట్యాంకు వద్దకు చేరుకున్నారు. కానిస్టేబుల్ జబీవుల్లా ట్యాంక్ ఎక్కి దూకకుండా ఆపగలిగారు. విషయం దావాలనంలా వ్యాపించడంతో జనం పెద్దసంఖ్యలో గుమిగూడారు. దీంతో సర్కిల్‌లో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. సీఐ మదనపల్లె అగ్నిమాపకదళాన్ని పిలిపించి ట్యాంకునీటిలో దిగిన కార్మికుడిని వలలో బంధించి ఫైర్‌సిబ్బంది కిందికి దింపారు. పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా శ్రీనివాసులుకు వెన్నెముక ఆపరేషన్ జరగడంతో పనులు చేయలేక పోతున్నాడని, భార్య తో సఖ్యతలేక పోవడంతో జీవితంపై విరక్తి చెందాడని, మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తే జీతం పెండింగ్‌లో పెట్టారని శ్రీనివాసులు చెప్పి నట్లు సీఐ తెలిపారు. భార్యాభర్తలకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.



జ్యోతిసర్కిల్‌లో గుమికూడిన జనం



ట్యాంకు నుంచి వలలో కిందికి దింపుతున్న అగ్నిమాపక సిబ్బంది

సీబీఐ డీఐజీగా వెంకటసుబ్బారెడ్డి



ఎర్రగుంట్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సీబీఐ డీఐజీగా చిన్నకొండు వెంకటసుబ్బారెడ్డి నియమితులయ్యారు. ఎర్రగుంట్ల మండలం హనుమనగుత్తి గ్రామానికి చెందిన ఐపీఎస్ అధికారి చిన్నకొండు వెంకటసుబ్బారెడ్డి 2007 అస్సాం-మేఘాలయ క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. అప్పట్లో ఆయన 126 ర్యాంకు సాధించి ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం మేఘాలయ డీఐజీగా పనిచేస్తున్నారు. సీబీఐ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా వెంకటసుబ్బారెడ్డిని నియమిస్తూ కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు చేసింది. ఈయన ఐదేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. సాధారణ మధ్యతరగతి రైతు కుటుంబానికి చెందిన ఈయన కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు. అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం సీబీఐ డీఐజీ స్థాయికి చేరుకున్నారు. వెంకటసుబ్బారెడ్డిని సీబీఐ డీఐజీగా నియమించడంతో తల్లిదండ్రులు వెంకటలక్షుమ్మ, రమణారెడ్డి, గ్రామస్తులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

రూ.2.56 లక్షలు వెంటనే చెల్లించాలి



హనీఫ్‌బాషాను విచారిస్తున్న డీఎల్‌పీఓ తిమ్మక్క

చాపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ ఆపరేటర్ హనీఫ్‌బాష వాడుకున్న రూ.2.56 లక్షలను 15 రోజుల్లోగా చెల్లించాలని జమ్మలమడుగు డీఎల్‌పీఓ తిమ్మక్క ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ హనీఫ్‌బాష జనవరి నెలలో భద్రిపల్లె పంచాయతీకి చెందిన రూ.2.56 లక్షలు సర్పంచు, అధికారి అనుమతి లేకుండా వాడుకున్నారు. మంగళవారం భద్రిపల్లెలో విచారించిన ఆమె ఈ డబ్బును ఎందుకు వాడుకున్నావని హనీఫ్‌ను ప్రశ్నించారు. తన భార్యకు చికిత్స కోసం వాడుకున్నానని హనీఫ్‌బాష వివరణ ఇస్తూ తిరిగి చెల్లిస్తానని తెలిపారు. ఈఓపీఆర్‌డీ క్రిష్ణవేణి, సర్పంచ్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

పోల్‌వాల్ట్‌లో చరణ్‌కు గోల్డ్‌మెడల్

దువ్వూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పుల్లారెడ్డిపేట డిగ్రీ కాలేజీ విద్యార్థి ఎస్.చరణ్ పోల్‌వాల్ట్ ఈవెంట్‌లో ప్రథమస్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించినట్లు కళాశాల వ్యాయామ అధ్యాపకులు కె.కన్నయ్య తెలిపారు. కర్నూలులో జరిగిన ఈ పోటీలో విద్యార్థి ప్రతిభను కొనియాడుతూ కాలేజీ కరస్పాండెంట్ ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి అతనిని అభినందించినట్లు చెప్పారు.

ప్రభుత్వాస్పత్రిలో మందులు చోరీ

మదనపల్లె టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో మందుల చోరీ విషయం మంగళవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. సర్వజన బోధనాస్పత్రిలో ఓ సెక్యూరిటీ మహిళా గార్డు విధుల నుంచి దిగి వెళ్లే సమయంలో ఆమె బ్యాగులో కొన్ని మందులు, సెలైన్ బాటిళ్లు వుండడాన్ని కొందరు వీడియో తీసి వైరల్ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజుకు కొందరు ఫిర్యాదు చేశారు. సెక్యూరిటీ గార్డును విచారించి ఆస్పత్రిలో ఉండాల్సిన మందులు గార్డు బ్యాగులో ఉండడంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

మూడు ఆలయాల్లో చోరీ

మదనపల్లె అర్బన్, అకోటబరు29.(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం, టీకేపల్లెలోని మూడు ఆలయాల్లో దొంగలు చోరీ చేశారు. కనకదాస్‌నగర్ పాలేటమ్మ ఆలయం, ఇదే ప్రాంతంలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయం, జాతీయరహదారి ఆనుకుని ఉన్న వరాల గంగమ్మ ఆలయంలో దొంగలు హుండీలను దోచుకెళ్లారు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు విచారణ చేపట్టారు.

మైలవరానికి 12000 క్యూసెక్కులు విడుదల

అవుకు నుంచి ఇన్‌ఫ్లో 12000 క్యూసెక్కులు

కొండాపురం, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): గండికోట నుంచి మైలవరానికి మంగళవారం 12000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కాగా ప్రాజెక్టులోకి అవుకు రిజర్వాయిర్ నుంచి జీఎన్ఎస్ఎస్ వరద కాల్వ ద్వారా 12000 క్యూసెక్కుల కృష్ణాజలాలు వచ్చి చేరుతున్నట్లు డీఈ తెలిపారు. మెయిన్ కెనాల్‌కు 75 క్యూసెక్కులు వదులుతున్నామని, గండికోటలో 26 టీఎంసీల నీరు ఉన్నట్లు డీఈ తెలిపారు.

కన్నేశారు.. అమ్మేశారు..!

- 2140 సర్వే నెంబరులో రూ.లక్షల విలువ చేసే స్థలం కబ్జా
- జగనన్న కాలనీ పేరిట అక్రమ పట్టాలు
- వైసీపీ నాయకులు, సానుభూతిపరులకు కట్టబెట్టిన నేతలు
- ప్రభుత్వం మారినా ఆగని అక్రమ కట్టడాలు



2140 సర్వే నెంబరులో అక్రమ కట్టడాలు

సుండుపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు ప్రభుత్వ స్థలాలను వైసీపీ నాయకులు కొందరు తమ అనుచరులకు అప్పనంగా అప్పజెప్పారు. ఐదు సంవత్సరాలు ప్రభుత్వ భూములే లక్ష్యంగా అమ్ముకున్న సంఘటనలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. ఒకటా, రెండా మండల కేంద్రంలో వాగులు, వంకలు, గుట్టలు, చెరువులను వదలకుండా అమ్ముకుని అక్రమాలకు తెరలేపారు. ప్రభుత్వ స్థలం ఉందని తెలిస్తే చాలు ఐదు సంవత్సరాలుగా వైసీపీ నాయకులు వాటిని కబ్జా చేసి కోట్లు కొల్లగొట్టారు. సుండుపల్లి మండల ప్రజల అవసరాల కోసం మంచినీటిని శుద్ధి చేసి ప్రజలకు అందించేందుకు 2017 టీడీపీ ప్రభుత్వంలో కేటాయించిన స్థలాన్ని వైసీపీ పాలనలో దర్జాగా అక్రమించి ప్లాట్లు వేసి వైసీపీ నాయకులు అమ్మేశారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ఏర్పాటు చేసి 2 రూపాయలకే తాగునీరు అందించాలన్న సంకల్పంతో టీడీపీ హయంలో అప్పటి ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి అధికారికంగా అగ్రహారం సమీపంలోని పెట్రోల్ బంకు వెనుక భాగంలో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. తాగునీటి కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసి బోరు వేశారు. ఆ స్థలాన్ని వైసీపీ అధికారంలోకి వచ్చాక కబ్జా చేసి పక్కా ప్లాన్ ప్రకారం ప్లాట్ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు అమ్ముకున్నారు. అంతేకాకుండా అప్పట్లో ఎవ్వరికీ అనుమానం రాకుండా అధికారులను తమకు అనుకూలంగా ఉండే వారిని మండల కేంద్రంలో వీఆర్వోలుగా నియమించుకుని జగన్న కాలనీ పేరుతో 2140 సర్వే నెంబరులో ప్రభుత్వ స్థలాన్ని ప్లాట్లుగా మార్చి అమ్ముకున్నారు. ఆ సర్వే నెంబరులో 1.25 ఎకరాల ప్రభుత్వ స్థలానికి అక్రమ పట్టాలు సృష్టించి లక్షల రూపాయలు దండుకున్నారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ఏర్పాటు కోరకు వేసిన శిలా ఫలకాన్ని మాయం చేశారు. అదే ప్రదేశంలో ఇప్పుడు ఇంటి నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇదంతా తెలిసినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. జగనన్న కాలనీ పేరిట దొంగ పట్టాలు సృష్టించి అమ్మకాలు చేశారు. 2140 సర్వే నెంబరులో ఎటువంటి పట్టాలు ఇవ్వలేదని అధికారులు చెబుతున్నారు కానీ అక్కడ ప్లాట్లు వేసి అమ్మి నిర్మాణాలు చేపడుతున్నా ఎటువంటి చర్యలు మాత్రం తీసుకోలేదు. అప్పటి తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సర్వేయరు అక్కడ జగనన్న కాలనీ ఏర్పాటు చేయలేదని, పట్టాలు ఇవ్వలేదని రాత పూర్వకంగా సమాచార హక్కు చట్టంలో కోరిన వారికి ఇచ్చారు. కానీ ఆ సర్వే నెంబరులో కొంతమంది వైసీపీ నాయకులు ప్లాట్లు వేసి దర్జాగా అమ్ముకుని లక్షలాది రూపాయలు సంపాదించుకున్నారు. అక్కడ ఇప్పుడు నిర్మాణాలు కూడా జరుగుతున్నాయి. అక్కడ అక్రమ నిర్మాణాలు తొలగించి ఆ స్థలాన్ని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి వినియోగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం..

అక్రమ నిర్మాణాలపై విచారించి చర్యలు తీసుకుంటాము. 2140 సర్వే నెంబరులో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు సమాచారం లేదు. ఆంధ్రజ్యోతి వివరణ అడగడంతో తెలిసింది. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం శిలాఫలకం అప్పట్లో ఏర్పాటుపై మండల ఆర్‌డబ్ల్యుఎస్ అధికారిని విచారిస్తాము.


- దైవాదీనం, తహసీల్దారు, సుండుపల్లి

అప్పన్నకుంటలో అక్రమ నిర్మాణాలు

మండల కేంద్రంలోని అప్పన్న కుంట (సర్వే నెంబరు 2169లో) చుట్టూ అక్రమ నిర్మాణాలు పుట్టుకొస్తున్నాయి. సుమారు 25 ఎకరాలు ఉన్న కుంట రోజురోజుకు కర్పూరంలా కరిగిపోతోంది. పెద్ద పెద్ద భవనాలు కడుతున్నా రెవెన్యూ అధికారులు అది ప్రభుత్వ భూమి కాదని అనుకుంటున్నారేమో.. ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత నిర్లక్ష్యంగా ఉండడం వెనుక మతలబు ఏమిటో అర్థం కావడం లేదు. అప్పన్నకుంటను, ప్రభుత్వ స్థలాలకు రక్షణ కల్పిస్తారని అనుకుంటే వచ్చిన రెవెన్యూ సిబ్బంది మౌనంపై కూటమి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

అక్రమ పట్టాలపై విచారణ ఎక్కడ

మండల కేంద్రంలో వైసీపీ అధికారంలో ఉన్నపుడు పదుల సంఖ్యలో అక్రమ పట్టాలు పుట్టుకొచ్చాయి. అవీనీతి అధికారుల చేతివాటం, అప్పటి పాలకుల నియంత పాలనకు నిదర్శనంగా దొంగ పట్టాలు సృష్టించారు. వందలాది పట్టాలు పుట్టించి అక్రమ నిర్మాణాలకు తెరలేపారు. అందులో మండల కేంద్రంలో పనిచేసిన వీఅర్వోలు పైఅధికారుల హస్తం ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విచారణ నిర్వహిస్తామని చెప్పిన మాటలు నీటిపై రాతల్లా మారిపోయాయని అందరూ మాట్లాడుకుంటున్నారు. ఆ మాటలను నిజం చేసే విధంగా రెవెన్యూ అధికారుల తీరు ఉందని స్పష్టంగా తెలుస్తోంది. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని కూటమి నేతలు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడం ఏమిటో అని ప్రజలు చర్చించుకుంటున్నారు.



2140 సర్వే నెంబరులో ఎటువంటి లేఆవుట్ వేయలేదని రాతపూర్వకంగా ఇచ్చిన అధికారులు



ఎటువంటి ఇంటి పట్టాలు ప్రభుత్వం ఇవ్వలేదని సమాచార హక్కు చట్టంలో ఇచ్చిన వైనం



అప్పన్నకుంట గట్టుపై నిర్మించిన మరుగుదొడ్లు



అప్పన్న కుంటలో అక్రమ నిర్మాణాలు

'జిల్లాపై అంత కక్ష ఎందుకు?'

వేంపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి గారు కడప జిల్లాపై అంత కక్ష ఎందుకు అని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి ప్రశ్నించారు. వేంపల్లెలో మంగళవారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మంత్రివర్గంలో కడప జిల్లాకు ప్రాతినిథ్యం లేదన్నారు. రూ.250కోట్లతో కడపజిల్లా కొప్పర్తి పారిశ్రామిక వాడకు సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని మంజూరు చేసిందన్నారు. సెప్టెంబరు 24న చంద్రబాబు ప్రభుత్వం ఈ కేంద్రాన్ని కొప్పర్తి నుంచి అమరావతికి మారుస్తూ జీఓ జారీ చేసిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం కడప జిల్లాకు, రాయలసీమకు అన్యాయం చేస్తోందన్నారు.

తానా సదస్సుకు శివారెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) నెలనెలా తెలుగు వెలుగు కార్యక్రమంలో భాగంగా ప్రాంతీయ మాండలిక భాష సాహిత్యాల అస్తిత్వం శీర్షికతో నవంబరు 24న జరగనున్న అంతర్జాతీయ అంతర్జాల సదస్సుకు సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డికి ఆహ్వానం అందింది. సదస్సులో రాయలసీమ యాసపై ఆయన ప్రసంగించనున్నారు. కార్యక్రమాన్ని తానా పూర్వ అధ్యక్షుడు డాక్టర్ తోటకూర ప్రసాద్ నిర్వహించనున్నారు. శివారెడ్డిని వైవీయూ వీసీ ప్రొఫెసరు క్రిష్టా రెడ్డి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ అభినందించారు.

2న చిత్రలేఖన పోటీలు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నవంబరు 2న చిత్ర లేఖన పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా బాలోత్సవం అధ్యక్షుడు గోపాల్, నాయకులు బి.లక్ష్మిరాజా, నాగమునిరెడ్డి, ఏలేశ్వర్ రావు తెలిపారు. మంగళవారం కడప యూటీఎఫ్ భవన్‌లో జిల్లా బాలోత్సవ సమావేశంలో వారు మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఉమ్మడి జిల్లాలో పులివెందుల, ప్రొద్దుటూరు, బద్వేలు, రాయచోటిలో చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

వైవీయూ పీఆర్ సెల్ సంచాలకులుగా డాక్టర్ సరిత



డాక్టర్ సరిత, ప్రొఫెసరు కాత్యాయనికి నియామకపత్రాలు అందిస్తున్న వైస్‌చాన్సలర్ కె.క్రిష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పబ్లిక్ రిలేషన్ సెల్ డైరెక్టరుగా పద్మ సరితను నియమించారు. ఈమేరకు వైస్ చాన్సలర్ ప్రొఫెసరు కె.క్రిష్ణారెడ్డి తన చాంబర్‌లో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసరు పద్మ సరితకు నియామకపత్రం అందించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంటు అసోసియేట్ ప్రొఫెసరుగా సరిత పనిచేస్తున్నారు. ఎన్ఎస్ఎస్ పీవోగా పలు సెల్‌లకు సమన్వయ కర్తగా శాఖాధిపతిగా పనిచేశారు. పరిశోధనల్లో పేటెంట్ కూడా పొందారు. పరిపాలన అనుభవం దృష్ట్యా డైరెక్టరుగా సరితను నియమించారు.

వైవీయూ అప్లైడ్ మేథమేటిక్ విభాగం ప్రొఫెసరు జి.కాత్యాయనిని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసరు కె.క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ ఆమెకు నియామకపత్రం అందించారు. ఇదివరకు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ప్రొఫెసరు పద్మను బాధ్యతల నుంచి తప్పించారు.

సోరియాసిస్‌పై అవగాహన సదస్సు



అవగాహన కార్యక్రమంలో ఆసుపత్రి ఉన్నతాధికారులు

కడప సెవెన్‌రోడ్స్ అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సోరియాసిస్ దినోత్సవ సందర్భంగా మంగళవారం కడప సర్వజన ఆసుపత్రి రిమ్స్ చర్మవ్యాధుల విభాగంలో రోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డెర్మటాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ ప్రారంభ దశలోనే సోరియాసిస్ వ్యాధికి చికిత్స చేయించుకోవాలన్నారు. ఫువాథెరపీ వంటి ఖరీదైన చికిత్సలు అందుబాటులోకి తెచ్చిన రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ ఫువాథెరపీ సదుపాయం ఈ ప్రాంతంలోని రోగులకు ఎంతో ఉపయోగకరమన్నారు. కడప వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ్ మాట్లాడుతూ సోరియాసిస్ మాత్రమే కాకుండా బొల్లిలాంటి అనేక చర్మవ్యాధులకు ఎటువంటి దుష్పరిణామాలు లేని చికిత్స చేయవచ్చని తెలిపారు. సోరియాసిస్ దీర్ఘకాలిక వ్యాధి అని.. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స చేయించుకోవాలన్నారు. చర్మవ్యాధుల విభాగం వైద్య అధ్యాపకులు, పీజీ విద్యార్థులు, నర్సింగ్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు

శిక్షణ ద్వారా యువత ఉపాధి పొందాలి

- జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్



జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్‌తో కెనరా బ్యాంకు ఆర్‌ఎం, డీఆర్డీఏ అధికారుల బృందం

కడప కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యువతకు ఆయా రంగాల్లో మంచి శిక్షణ ద్వారా వారి ఉపాధి మెరుగపరిచాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, కెనరా బ్యాంకు ఆర్‌ఎం మురళీ మోహన్‌లు జిల్లాస్థాయి ఆర్సీటీ అడ్వైజరీ కమిటీ సమాశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ కమిటీ ఉద్దేశ్యాలపై రివ్యూ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆరు నెలల్లో ఎన్ని శిక్షణా కార్యక్రమాలు చేశారని, ఎంత మందికి ఉపాధి దొరికిందని అడిగి తెలుసుకున్నారు. నిరుద్యోగ యువతను సమీకరించి.. వారికి శిక్షణ ఇవ్వడం పట్ల కలెక్టర్ అభినందించారు. నవంబరు 20వ తేదీ నుంచి మహిళలకు దుస్తుల తయారీ, ఉమెన్స్ టైలర్, బ్యూటీ పార్లర్ మేనేజ్మెంట్, ఎంబ్రాయిడరీ, జూట్ బ్యాగుల తయారీని కడప కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఇక్కడ జరిగే అన్ని కార్యక్రమాలకు ట్రెనింగ్ మెటీరియల్, వసతి, భోజన సదుపాయాలు పూర్తిగా ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమాలను అన్నమయ్య, కడప జిల్లా నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం జనార్థన్ డీఆర్డీఏ పీడీ ఆనంద్‌నాయక్, నాబార్డు డీడీఎం విజ య్ విహారి, డీఐసీజీఎం చాంద్‌బాష, ఆర్సీ టీ డైరెక్టర్ ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



మృతి చెందిన రాజశేఖర్

కమలాపురం రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నల్లింగాయపల్లె గ్రామం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజశేఖర్ (56) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రంగా గాయపడిన సుబ్బరాయుడు(19) అనే యువకుడిని 108లో రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి వివరాల మేరకు.. ప్రొద్దుటూరు మండలం వినాయకనగర్‌కు చెందిన కాటం రాజశేఖర్ అనే వ్యక్తి అగస్త్యలింగాయపల్లెలో తమ బంధువుల పెళ్లికి వచ్చాడు. మలిపెళ్లి అయిపోయిన తరువాత తిరిగి ప్రొద్దుటూరుకు వెళ్లేందుకు రోడ్డుపై నడుచుకుంటూ పోతుండగా భారతి సిమెంటు ఫ్యాక్టరీ సమీ˘ఎంలోకి రాగానే ముద్దల సుబ్బరాయుడు స్కూటరుపై మరో వ్యక్తిని ఎక్కించుకుని అతివేగంగా వస్తూ.. అదుపు తప్పి రాజశేఖర్‌ను ఢీకొట్టాడు. దీంతో రాజశేఖర్ అక్కడికక్కడే మృతి చెందగా సుబ్బరాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని రిమ్స్‌కు తరలి స్తుండగా మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మత్తు పదార్థాలతో ప్రాణాలకు ముప్పు

- నెహ్రూయువ కేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ



మాట్లాడుతున్న నెహ్రూయువ కేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ

కడప మారుతీనగర్, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల వాడకంతో ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని నెహ్రూయువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ యువతకు సూచించారు. నెహ్రూయువ కేంద్రం, జేబీవీఎస్ ది ఫిరజర్వేర్ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఉక్కాయపల్లె నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో మాదక ద్రవ్యాలు యువతని ఏ విధంగా ప్రభావితం చేస్తున్నాయి అనే అంశంపై యువతీ, యువకులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలకు సంబంధించి ప్రత్యేక సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. యువత ఎక్కువగా మాదక ద్రవ్యాలకు అలవాటుపడి, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. మత్తులో వున్న యువకులు ఇతరులతో అసభ్య ప్రవర్తనతో పాటు దొంగతనాలకు కూడా పాల్పడుతూ సమాజం ఛీ కొట్టేలా ప్రవర్తిస్తున్నతీరు సరికాదన్నారు. మొదట సరదాగా మొదలయ్యే మాదకద్రవ్యాల వాడకం క్రమక్రమంగా పెరుగుతుందన్నారు. దీంతో బానిసలకు మారి అఘాయిత్యాలకు పాల్పడడం జరగుతున్నదన్నారు. కావున ఇప్పటికైనా యువత మాదక ద్రవ్యాల వాడడంపై సరైన అవగాహనతో మెలగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిమ్స్ సైక్రియాట్రిస్ట్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరాముడు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ శ్రీధర్, సమితి వ్యవస్థాపకులు అశోక్, మదర్ థెరిసా ఫౌండేషన్ చైర్మన్ విజయ్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన రోడ్డు ప్రమాదం

- బాంబ్‌స్క్వాడ్ వాహనాన్ని ఢీకొన్న ఇసుక ట్రాక్టర్

వేంపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపల్లె వద్ద మంగళవారం ఉదయం బాంబ్‌స్క్వాడ్ వాహనాన్ని ఇసుక ట్రాక్టర్ ఢీకొంది. దీంతో బాంబ్‌స్క్వాడ్ వాహనం రోడ్డుపక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాకపోవడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటన నేపథ్యంలో బాంబ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసుకుంటూ పులివెందులకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

స్వల్ప స్కోర్‌కే చేతులెత్తేసిన గుంటూరు

- భారీస్కోర్ సాధించిన శ్రీకాకుళం, నెల్లూరు జట్లు



ఏసీఏ క్రికెట్ మైదానంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-14 ఇంటర్ డిస్ట్రిక్ట్ గ్రూప్-బి మల్టీడే రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా మంగళవారం 152 పరుగుల స్వల్ప స్కోర్‌కే గుటూరు జట్టు ఆలౌట్ అయ్యింది. మరో రెండు వేర్వేరు మ్యాచ్‌లలో శ్రీకాకుళం, నెల్లూరు జట్లు భారీ స్కోర్లు సాధించాయి. వివరాలిలా....

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో క్రిష్టా-గుంటూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన గుంటూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి 63 ఓవర్లలో కేవలం 152 పరుగులకే చేతులెత్తేసింది. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన క్రిష్టా జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 28.3 ఓవర్లలో 1 వికెట్ మాత్రమే కోల్పోయి 80 పరుగులు చేసింది. ఇందులో భానుచంద్‌యాదవ్ 42 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. ఇంకా 72 పరుగుల వెనుకంజలో క్రిష్టా జట్టు ఎదురీదుతోంది. అలాగే ఏసీఏ క్రికెట్ మైదానంలో విజయనగరం-శ్రీకాకుళం జట్ల మధ్య మ్యాచ్ సాగింది. టాస్‌నెగ్గిన శ్రీకాకుళం బ్యాటింగ్ చేపట్టి 89 ఓవర్లలో 336 పరుగులు భారీ స్కోర్ సాధించింది. ఇందులో ఎన్.జోగేంద్ర 124 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. కాగా బౌలింగ్ విభాగంలో శ్రీచరణ్ 5 వికెట్లు సాధించడం విశేషం.

కేఓఆర్‌ఎం మైదానంలో నెల్లూరు-అనంతపురం జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత నెల్లూరు జట్టు 60.1 ఓవర్లలో 264 పరుగులు చేసింది. ఇందులో సుశాంత్ 75 పరుగులు చేశాడు. బౌలింగ్ విభాగంలో ఎండీ రోహిత్ 5 వికెట్లు పడగొట్టాడు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 29 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 108 పరుగులు చేసింది. ఇందులో ఆది నారాయణరెడ్డి 45 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నాడు. కాగా మరో 156 పరుగుల లోటుతో అనంతపురం జట్టు ఎదురీదుతోంది.



జోగేంద్ర (శ్రీకాకుళం) 124 నాటౌట్



5 వికెట్లు తీసిన శ్రీచరణ్ (విజయనగరం)

అటెళ్తే..రంగు మారుద్ది..అంతే

● చినుకు పడితే చిత్తడే.. ● హామీలు గుప్పిస్తారు.. ఆ తర్వాత పట్టించుకోరు

పెండ్లిమర్రి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు వస్తే నేతలకు ప్రజలు, వారి సమస్యలు, మౌలిక సదుపాయాలు గుర్తుకు వస్తాయి. ఓట్ల కోసం అభివృద్ధి జపం చేస్తారు. మా పార్టీ అధికారంలోకి వస్తే అన్ని సమస్యలూ పరిష్కరిస్తామని, మౌలిక వసతులు కల్పిస్తామంటానే ప్రజలు నమ్మి ఓట్లేస్తారు. సమస్యలు పరిష్కారం అవుతాయని ఎదురుచూస్తారు. అయితే ఆ నాయకులకు గద్దెనెక్కాక హామీలు మాత్రం గుర్తుండటం లేదు. సమస్యలు పరిష్కారం కాక ప్రజలు అవస్థలు పడుతున్నారు. అలాంటి కోవకు చెందినదే పెండ్లిమర్రి మండల కేంద్రం నుంచి యాదవాపురం, కొత్తపల్లె, చెర్లోపల్లె గ్రామాలకు వెళ్లేదారి. కొన్నేళ్లుగా వర్షాలు వస్తే రోడ్డు చిత్తడి చిత్తడిగా మారి గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి. ఈ చుట్టుపక్కల ఐదు గ్రామాల ప్రజలకు పంట పొలాలన్నీ ఈ రోడ్డు సమీపంలోనే ఉన్నాయి. నిత్యం రైతులు, కూలీలు, ఆటోలు, మోటార్ వాహనాల్లో ఈ ఎర్రటి చిత్తడి నేలలో వెళ్లాల్సిన దుస్థితి. వర్షాకాల వచ్చిందంటే బురద పూసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని, రాత్రి వేళ ద్విచక్రవాహనాలపై వెళ్లే వాహనదారులు ఈ బురదరోడ్లలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. యాదవాపుర, కొత్తపల్లె, చెర్లోపల్లె గ్రామాల ప్రజలు మాకు ఎన్నో ఏళ్లుగా ఈ రోడ్డు సమస్య ఉందని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అధికారులు


పెండ్లిమర్రి నుంచి కొత్తపల్లెకు వెళ్లేదారి

వచ్చి ఆ దారిని పరిశీలించి వెళ్లారని, ఎలాంటి ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడైనా కూటమి ప్రభుత్వం వచ్చినందున సమస్యను పరిష్కరిస్తారని ఆయా గ్రామాల ప్రజలు ఆశిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే గ్రామాల్లో మౌలిక వసతులు, సీసీ రోడ్లు, మినీ గోకులాలు, డ్రైనేజీ కాల్వల ఏర్పాటుకు ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేశారు. ఇందులో భాగంగా తమ గ్రామానికి కూడా రోడ్డును ఏర్పాటు చేయాలని వారు ప్రజాప్రతినిధులను, అధికారులను వేడుకుంటున్నారు.

వర్షాకాలం వస్తే నరకయాతనే



వర్షాకాలం వచ్చిందంటే మండల కేంద్రం సహా ఇతర పట్టణాలకు వెళ్లాలన్నా, వ్యవసాయ పొలాలకు వెళ్లాలన్నా ఈ బురద రోడ్డుపై వెళ్లాల్సిందే. అడుగు తీసి అడుగు పెట్టాలంటే నరకయాతనే. బైకుపై వెళ్లాలన్నా, పిల్లలను బడికి పంపాలన్నా కష్టమే.

- చిన్నబోయిన రాజా, యాదవాపురం

ఆచరణ శూన్యం



సమస్యను పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేదు. ఇప్పటికైనా ఈ రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

- జయచంద్రారెడ్డి, కొత్తపల్లె

చిత్రం చెప్పిన సమస్య


చెన్నూరు - కొండపేట పెన్నానది బ్రిడ్జిపై అంధకారం అలుముకుంది. సుమారు 700 మీటర్ల దూరం ఉన్న ఈ వంతెనపై దాదాపు 20 లైట్ల వరకు వెలగాల్సి ఉన్నా రెండు లైట్లు మాత్రమే వెలుగుతుంటాయి. ఈ రోడ్డుపై పలు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా.. అంటూ వాహనదారులంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - చెన్నూరు, (ఆంధ్రజ్యోతి)

ఉపనిషత్తుల సారమే భాగవతం

కడప నాగరాజుపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : శ్రీమద్ భాగవతం వేద, వేదాంతాల సారమని, ఉపనిషద్విజ్ఞానమని, మానవాళికి సాక్షాత్ భగవంతుడు ప్రసాదించిన వరమని రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆచార్య మూల మల్లిఖార్జునరెడ్డి అన్నారు. మంగళవారం పాత కడపలో హిందూ ధర్మం సమాజ ప్రార్థనా దేవాలయాల సంస్థ వారు నాగేంద్ర మహోదరస్వామి ఆశీస్సులతో ఏర్పాటు చేసిన ధార్మిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యాసుని అష్టాదశ పురాణాల్లో భాగవతం విశిష్టమైందని, దీన్ని పోతన తెనెలొలుకు పదాలతో మనకు అందించారన్నారు. ఇది భక్తితత్వాన్ని, భగవతత్వాన్ని ఆవిష్కరించిందన్నారు. సభాధ్యక్షుడు కాల్వ అర్జునరెడ్డి మాట్లాడుతూ భాగవతం చదివితే మనం బాగుపడతామన్నారు. అనంతరం కవి లోకనాథం మాట్లాడారు. సంస్థ చైర్మన్ సోమకళానాథరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాకారుల కోలాటం ఆకట్టుకుంది.

రీయింబర్స్‌మెంటు విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పెండింగులో ఉన్న రీయింబర్స్‌మెంటు స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, రవి డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దారు లక్ష్మీనారాయణరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిగ్రీ, ఇంజనీరింగ్, డీఫార్మసీ వంటి ఉన్నతమైన విద్యలో పెండింగులో ఉన్నటువంటి రీయింబర్స్‌మెంటు దాదాపు 3వేల కోట్లు ఉందన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించి రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పోరాటాలకు సిద్ధం కావాలి: డీవైఎఫ్ఐ

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : విభజన హామీల అమలుకు కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, దీనిపై పోరాటాలకు సిద్ధం కావాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాము, రామన్న, డీవైఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. డీవైఎఫ్ఐ కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కడప ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ అధ్యక్షతన మంగళవారం విభజన హామీలు, కడప ఉక్కు పరిశ్రమ, కొప్పర్తి కారిడార్ అభివృద్ధి అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కడప ఉక్కు సాధనే లక్ష్యంగా యువత పోరాటాలు సిద్ధం కావాలన్నారు. జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, సహాయకార్యదర్శి తులసి, అంజి, ఉపాధ్యక్షులు నరసింహ, డేవిడ్, కడప నగర కన్వీనరు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమాలయ నిరాశ్రయుల వసతిగృహంలో అన్నదానం

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):జనసేన ప్రధాన కార్యదర్శి పీఏసీ సభ్యులు కొణిదెల నాగబాబు జన్మదిన సందర్భంగా కడప ప్రేమాలయ నిరాశ్రయుల వసతిగృహంలో మంగళవారం కడప జనసేన నాయకుడు తుంగా రమణయ్య అన్నదానం, కేక్ కటింగ్ చేశారు. జనసేన నాయకులు, జన సైనికులు పాల్గొన్నారు. పవన్‌కళ్యాణ్ సోదరుడి జన్మదినాన్ని పురస్కరించుకుని నిరాశ్రయులైన వారికి అన్నదానం చేయడం, మొక్కలు నాటడం తమకెంతో సంతోషంగా ఉందని తుంగా రమణయ్య తెలిపారు.


అన్నదానం చేస్తున్న జనసేన నాయకులు

'ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి'

కడప సెవెన్‌రోడ్స్ అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) :ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మంగళవారం కడప కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిలేటి మాట్లాడారు. డ్రైవర్లకు 5 నుంచి 10 లక్షల రూపాయలు చంద్రన్న బీమా అమలు చేస్తామని, డీజలు, పెట్రోలు ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చి వంద రోజులు పూర్తయినా అమలు చేయలేదన్నారు. ఈ-చలానా రద్దు చేయాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పావలా వడ్డీకే రుణాలు ఇవ్వాలని, ప్రతి ఆటో కార్మికుడికి ఇంటిస్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ కడప నగర అధ్యక్ష, కార్యదర్శులు పుల్లయ్య, నారాయణ, ఆటో యూనియన్ నాయకులు నాగిరెడ్డి, నారాయణస్వామి, రామచంద్రయ్య, నారాయణ, రెడ్డయ్య, శివ, నాగమల్లిఖార్జున, శివక్రిష్ణ, బాబు, రాము, కుళాయప్ప, తిమ్మన్న, ఆటోకార్మికులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

ఇళ్లస్థలాలు, భూముల కోసం ఉద్యమించండి: సీపీఐ

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లస్థలాలు, భూముల కోసం ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం దళిత హక్కుల పోరాట సమితి, ఏపీ గిరిజన సమాఖ్య సంయుక్త సంఘాల సమావేశం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్ అధ్యక్షతన జరిగింది. చంద్ర మాట్లాడుతూ దళితులు, వ్యవసాయ కూలీలు, గిరిజనులకు రెండు ఎకరాల సాగు భూమి కోసం ఉద్యమించాలన్నారు.దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇమ్మానియేల్, మునెయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ మల్లిఖార్జున, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బ్రహ్మం, శంకర్ నాయక్, డప్పు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సాయికుమార్‌పై అభియోగాలు రద్దు

లింగాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):విధులు నిర్వర్తించడంలో తీవ్ర అలసత్వం కారణంగా మండలంలోని దొండ్లవాగు గ్రామ హార్టికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేసిన సాయికుమార్‌ను గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగం నుంచి తొలగించింది. ఇ-క్రాప్, ఈ-కేవైసీని పూర్తిచేయడంలో విఫలమై పంటల బీమా రాకుండా కారకుడయ్యాడని ఫిర్యాదుతో ఉద్యోగం తొలగించారు. సాయికుమార్ తనవాదనను ఉన్నతాధికారులకు పలుమార్లు వినిపించడంతో సాయికుమార్‌పై మోపిన అభియోగాలను రద్దుచేస్తూ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. అన్నమయ్య జిల్లాలో ఉద్యోగం కేటాయిస్తూ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ కడప జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారి సాయికుమార్‌కు సంబంధించి తదుపరి చర్యలు తీసుకోమని ఆదేశించారు

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో రక్తదాన శిబిరం

వేంపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పులివెందుల డీఎస్పీ మురళీ రిబ్బన్ కట్ చేసి ప్రాంభించారు. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్కేవ్యాలీ స్టేషన్ సీఐ, ఎస్ఐలు రమణ, భాస్కర్ రెడ్డి, ఇడుపులపాయ అధికారులు పాల్గొన్నారు.

రేపు ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

కడప నాగరాజుపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 31న నిర్వహించనున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) గౌరవ అధ్యక్షుడు కేసీ బాదుల్లా, నగర అధ్యక్ష, కార్యదర్శులు నరసింహారావు, తారక రామారావు తెలిపారు. మంగళవారం కడప నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద వాల్‌పోస్టర్ విడుదల చేశారు.

మహిళలకు చేయూత మెప్మాబజార్

పులివెందుల రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు మెప్మా బజార్ దోహదపడుతుందని పులివెందుల మున్సిపల్ వైస్‌చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, కమిషనర్ రాముడు తెలిపారు. మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ ఎస్.తేజ్‌భరత్ ఆదేశాల మేరకు స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా మహిళా మార్ట్ వద్ద మంగళవారం ఏర్పాటుచేసిన మెప్మా బజార్‌ను ప్రారంభించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

వేముల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రబీలో శనగ సాగులో నూతన యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చు అని మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని చాగలేరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

లింగాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వరిపంటలో ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ రమేష్ పేర్కొన్నారు. పార్నపల్లె గ్రామంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో కలిసి వరిపంటను పరిశీలించారు.

'చలో విజయవాడ'కు తరలిరండి


మాట్లాడుతున్న దండు వీరయ్య మాదిగ

కడప మారుతీనగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయాలని, ఇందుకోసం చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమానికి మాదిగలంతా తరలిరావాలని ఏపీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉందని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మన దేశంలో గల అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఇనుప దుకాణంలో చోరీ

కడప క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలోని ఇనుప సామాన్ల దుకాణంలో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు తాలూకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సీఐ వివరాల మేరకు... కడప చెందిన వెంకటరమణ ఇనుప సామాన్ల దుకాణంపై ఉన్న ఇనుప రేకును దొంగలు తొలగించి రూ.30 వేల నగదును దోచుకెళ్లినట్లు తెలిపారు.

పులివెందుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లా

● రెండు నెలల్లో అన్నీ సర్దుకుంటాయి: నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీటెక్ రవి

వేంపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పులివెందుల సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని, రెండు నెలల్లో అన్నీ సర్దుకుంటాయని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఆయన మొక్కలు నాటారు. మండల పరిషత్ సభాభవనంలో సబ్సిడీ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమావేశంలోను, అనంతరం విలేకరులతోను బీటెక్ రవి మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడే సమయంలో కౌంటింగ్ జరిగిన వెంటనే డీలర్‌షిప్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ట్రిపుల్‌ఐటీలో మెస్‌లు, వాటర్ ప్లాంట్‌లు తదితర వాటిని స్వాధీనం చేసుకున్నారని, టీడీపీ కార్యకర్తలకు ఇప్పటికీ కొన్ని చోట్ల ఇప్పించుకోలేని పరిస్థితి ఉందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇలా కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నాయని, వీటిని సరిచేయాలని కోరానన్నారు. పులివెందుల నుంచే క్రమశిక్షణ మొదలవుతుంది, రెండు నెలలు ఓపికపట్టండి, అందరికి న్యాయం జరుగుతుందని బాబు భరోసా ఇచ్చారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మునిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, జిల్లా గ్రంథాలయమాజీ చైర్మన్ బాలస్వామిరెడ్డి, రాష్ట్ర రైతు నాయకులుజగన్నాథరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి, యువనాయకులు రజనీకాంత్‌రెడ్డి, వేమ, పసుపులేటి వీరభద్ర, గండి మాజీచైర్మన్ వెంకటస్వామి, జిల్లా మాజీ కార్యదర్శి ఎద్దుల శేషారెడ్డి, బాలకృష్ణారెడ్డి, సింగారెడ్డి శివకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న బీటెక్ రవి

మెడికల్ కళాశాలను ఔట్‌సోర్స్ ఉద్యోగులతోనే ప్రారంభించారు

వేంపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మెడికల్ కళాశాలను వైసీపీ ప్రభుత్వంలో హడావిడిగా ప్రారంభించారని, ఎలాంటి వసతులు లేకుండానే ప్రారంభం చేయడం వెనుక 300 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకునేందుకే అని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి తెలిపారు. వేంపల్లెకు వచ్చిన ఆయన మెడికల్ కళాశాల సమస్యపై మాట్లాడుతూ మెడికల్ కళాశాలను ప్రారంభించడంలో టీడీపీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ప్రచారాన్ని కొట్టిపారేశారు.

సభ్యత్వ నమోదుతో కార్యకర్తకు భరోసా: టీడీపీ


పెండ్లిమర్రి: సభ్యత్వ నమోదును ప్రారంభించిన గంగిరెడ్డి... వీఎన్‌పల్లెలో సభ్యత్వ నమోదు

పెండ్లిమర్రి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదుతో కార్యకర్తకు భరోసా ఉంటుందని టీడీపీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డి తెలిపారు. మండలంలోని చెర్లోపల్లె గ్రామ పంచాయతీలో మంగళవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గంగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని మండలంలోని 19 గ్రామ పంచాయతీలలో ప్రారంభించి పూర్తిచేయాలని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ఆదేశించారన్నారు.

వీఎన్‌పల్లె: కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు కొక్కు గోపాల్‌యాదవ్, జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 150 మందికి టీడీపీ సభ్యత్వం చేయించారు. ఐటీడీపీ టీం సభ్యులు బట్టి ఆది సూర్యనారాయణరెడ్డి, శ్రీకాంత్ యాదవ్, పట్టాభి, రాఘవ పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు చేస్తున్న బొజ్జ తిరుమలేశ్

సభ్యత్వం ఒక భరోసా: టీఎన్ఎస్ఎఫ్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):టీడీపీ సభ్యత్వం ఒక భరోసా అని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బొజ్జతిరుమలేశ్ తెలిపారు. మంగళవారం కడప నగరంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి ఆదేశాల మేరకు కార్యక్రమం చేపట్టామన్నారు.

నిబంధనలు తప్పక పాటించాలి: సీఐ

పులివెందుల టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల పట్టణంలోని స్థానిక లయోల కళాశాల సమీపంలో మంగళవారం నిబంధనల ప్రకారం అనుమతి ఉన్న లైసెన్సుదారులు 25 మంది బాణసంచా దుకానాలు ఏర్పాటు చేసినట్లు సీఐ జీవన్ గంగానాథ్‌బాబు తెలిపారు. ప్రజలు ఈ దుకాణాల వద్దే బాణసంచా కొనుగోలు చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమించి దుకాణాలు ఏర్పాటు చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : డీఎస్పీ

కమలాపురం రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : దీపావళి సందర్భంగా టపాసులు విక్రయించే వారు నిబంధనలు అధిగమిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ వెంకటేశ్వర్లు, తహసీల్దారు శివరామిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో లాటరీ పద్ధతిన షాపులను కేటాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టపాసులు ధరల మేరకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు.


టపాసుల విక్రయదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

తల్లిదండ్రుల పర్యవేక్షణలోనే పిల్లలు టపాసులు పేల్చాలి

తల్లిదండ్రుల పర్యవేక్షణలోనే పిల్లలు టపాసులు పేల్చాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన టపాసుల దుకాణదారులకు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవు

మండల పరిధిలో ఎవరైనా బెల్టుషాపు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం స్థానిక సీఐ రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డితో కలిసి స్థానిక పోలీసుస్టేషన్‌లో బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఘనంగా రాహుకాల పూజలు


ప్రత్యేక అలంకారంలో విజయదుర్గాదేవి...రాహుకాల పూజలు చేస్తున్న మహిళా భక్తులు

కడప కల్చరల్, అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి): కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు హాజరై అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించి ఆ తల్లిసేవలో తరించారు.

రేపు ఆలయంలో ధనలక్ష్మీపూజ: దీపావళి పర్వదినం సందర్భంగా గురువారం ఉదయం 10 గంటలకు ధనలక్ష్మీ పూజ జరగనుందని, భక్తులు పాల్గొనాలని అర్చకులు కోరారు.

50 ఏళ్లు నిండిన పురోహితులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి

కడప కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): 50 సంవత్సరాలు నిండిన పురోహితులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని పురోహిత బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర నాయకులు వైనరసింహమూర్తి, టి.సునీల్, పి.నారాయణ మూర్తి తదితరులు కోరారు. ఏలూరు జిల్లా భీమవరం ఆనంద్ ఫంక్షన్ హాలులో మంగళవారం నిర్వహించిన స్మార్త విద్వత్ మహాసభలో వారు మాట్లాడారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పోరుమామిళ్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం 30తేది నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమణారెడ్డి తెలిపారు. బుధవారం పోరుమామిళ్లలోని స్త్రీశక్తి భవనంలో మండల అధ్యక్షురాలు తహాసేస్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందన్నారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు త ప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

టపాసుల విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

కొండాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో టపాసులు విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా అనుమతులు పొందాలని కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు.మండలంలో కొండాపురంలో ఇద్దరు, తాళ్లప్రొద్దుటూరులో ఇద్దరు టపాసులు విక్రయించేందుకు అనుమతులు పొందారన్నారు. టపాసులు విక్రయించే కేంద్రాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి టపాసులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

33 మద్యం సీసాలు స్వాధీనం

కాశినాయన అక్టోబరు(ఆంధ్రజ్యోతి) 29: గొంటువారిపల్లె గ్రామంలో మంగళవారం అక్రమంగా మద్యం అమ్ముతున్న (బెల్ట్ షాపు నిర్వహిస్తున్న) వేములకోట హుస్సేనయ్యను అరెస్ట్ చేసి అతనివద్ద నుంచి 33 లిక్కర్ సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు.ఆమేరకు కేసునమోదుచేసి లిక్కర్ బాటిళ్ళు సీజ్ చేశామన్నారు.మండలంలో ఎక్కడైనా ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

పోరుమామిళ్లలో 18...

పోరుమామిళ్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యంరవాణా చేస్తున్న కవలకుంట్లకు చెందిన పాపయ్య అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 18 మద్యం బాటళ్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. మంగళవారం సాల్వ కట్ట క్రాస్ రోడ్డు వద్ద పాపయ్య మద్యం రవాణా చేస్తుండగా అతన్ని అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

పూర్తి అయ్యేదెన్నడు..?

- ఆగిపోయిన రెండో విడత నాడు-నేడు పనులు
- చాలీచాలని గదులతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- శిథిలావస్థకు చేరిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విరాట్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. రెండో విడత నాడు-నేడు పనులు ఆగిపోవడంతో విద్యార్థుల ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయి. 1998లో విరాట్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ పాఠశాలలో 116 మంది విద్యార్థులు, 5 గురు ఉపాధ్యాయులు ఉన్నారు. గతంలో డిపెప్ నిధులతో తరగతి గదులు నిర్మించారు. నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. స్లాబ్ పెచ్చులూడిపడుతుండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. స్లాబ్‌కు మరమ్మతులు చేశారు. అలాగే రెండో విడత నాడు-నేడు పనులు పాఠశాలకు మంజూరు చేశారు. రూ.43 లక్షలతో రెండు తరగతి గదులు, రెండు మరుగుదొడ్లు మంజూరయ్యాయి. మేడపైన రెండు తరగతి గదులు నిర్మించారు. ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారడంతో రెండో విడత నాడు-నేడు పనులు నిలిచిపోయాయి. రెండు తరగతి గదులు నిర్మించినా కిటికీలు, తలుపులు బిగించకపోవడం, ఎలక్ట్రికల్ పనులు, పెయింటింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ముఖ్యంగా మిద్దెపైన నూతనంగా





స్లాబ్ పెచ్చులూడుతుండడంతో మరమ్మతులు చేసిన దృశ్యం, తగ్గులో ఉన్న తరగతి గదులు

నిర్మించిన తరగతి గదులకు వెళ్లడానికి ఉన్న తాపలకు ఇరువైపుల ర్యాంప్ ఏర్పాటు చేయకపోవడంపై చిన్నపిల్లలు పైకి ఎక్కడం ప్రమాదకరంగా మారింది. దీంతో నూతన తరగతి గదులు నిర్మించినా ఉపయోగించుకోలేకపోతున్నారు. పాత తరగతి గదుల్లోనే విద్యార్థులు సర్దుకుంటున్నారు. పాఠశాల ముందు ఉన్న కొద్దిపాటిమైదానం బండలతో ఎత్తు చేయడంతో పాత తరగతి గదులు తగ్గులోకి వెళ్లాయి. దీంతో వర్షం పడినప్పుడు నీరంతా తరగతిగదుల్లోకి చేరి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. నాడు-నేడు పనులు పూర్తి చేసిన తరగతి గదుల్లోకి వర్షం నీరు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చట్టాలను తెలుసుకోండి

మైదుకూరు రూరల్ అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ రాజ్యాంగంలోని చట్టాల గురించి తెలుసుకోవాలని, మానవ హక్కులకు భంగం వాటిల్లితే వాటిని చట్టం ద్వారానే పరిష్కరించుకోవాలని జిల్లా జడ్జి బాబా ఫకృద్దీన్ తెలిపారు.మండలంలోని గంజికుంట పంచాయతీలోని సుగాలితాండాలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి ఆధ్వర్యంలో లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో ట్రైబల్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ ఆఫీసర్ సరస్వతి, తహసీల్దార్ రాజసింహ్మా నరేంద్ర, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనలో యువతదే కీలకపాత్ర

ఖాజీపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అవినీతిని నిర్మూలించేందుకు యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ శ్వేత అన్నారు. మంగళవారం స్థానిక సాహిత్య డిగ్రీ కళాశాలలో యువజన వ్యవహారాల క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్రం అవినీతి నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ లెక్చరర్లు, ట్రస్టు మెంబర్లు మాలకొండయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలాలు ఆక్రమిస్తే ఉపేక్షించవద్దు

కౌన్సిలర్లు చెప్పినా, పత్రికలో కథనాలు వచ్చినా అధికారులు స్పందించండి ● మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే వరద ఆదేశాలు

ప్రొద్దుటూరు అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ స్థలాలు ఆక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని, మున్సిపల్ ఆస్తులను పరిరక్షిం చాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అధికారుల ను ఆదేశించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ భీముని పల్లె లక్ష్మీదేవి అధ్యక్షతన అత్యవసర కౌన్సిల్ సమావేశంజరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ఏ వార్డులో ప్రజలు తమ సమస్యల ను అధికారుల దృష్టికి తెచ్చినా, కౌన్సిలర్లు తెలిపినా, పత్రికల్లో కథనాలు వచ్చినా వెంటనే పరిష్కరించాలన్నారు. పత్రికల్లో వచ్చిన వార్తపై విచారించి అవినీతికి పాల్పడిన వారు ఎవ్వరైనా చర్యలు తీసుకోవాలన్నారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై స్పందించి చర్యలు తీసుకోవలాని అధికారుల ను ఆదేశించారు. కౌన్సిలరు వంగనూరు మురళీధర్‌రెడ్డి మాట్లా డుతూ ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'మున్సిపాలిటీలో అవినీతి చీడ' కథనాన్ని ప్రస్తావించారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ ఆంధ్రజ్యోతి లో వచ్చిన కథనం వాస్తవమని ఉద్యోగులకు ఇప్పటికే మెమో ఇచ్చామని వారిచ్చే సమా ధానం బట్టి



కౌన్సిల్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఆంధ్రజ్యోతి కథనంపై చర్చిస్తున్న కౌన్సిలర్ మురళీధర్ రెడ్డి

సాక్ష్యాలు ఆధారంగా వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కౌన్సిలర్ సరిత మాట్లాడుతూ 17 వవార్డులో కాలువ స్థలంలో ఆక్రమణలు జరిపి ఇళ్ళు నిర్మించారని వీటిపై చర్యలు తీసుకోమని అనేక సార్లు మీటింగుల్లో ప్రశ్నించినా టౌన్ ప్లానింగ్ అధి కారులు చర్యలు తీసుకోలేదన్నారు. ఇందుకు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి స్పందిస్తూ ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మించిన కట్టడాలను ఎలాంటి హెచ్చరికలు లేకుండానే కూల్చి వేయాలన్నారు. కౌన్సిలర్ ఇర్ఫాన్ మాట్లాడు తూ శ్రీరాముల పేటలో మున్సిపాలిటీ సర్వేయ ర్ సర్వేచేసి కాలువ స్థలం ఆక్రమణకు గురయిందని తొలగించాలని గత కమిషనర్ రఘునాథ రెడ్డి నోటీసులు ఇస్తే ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ సర్వేపై కట్టడం యజమాని అభ్యంతరాలు వ్యక్తం చేశారని అతని సమక్షంలో, ఇరిగేషన్ అధికారుల సమక్షంలో తిరిగి సర్వే చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఎగ్జిబిషన్‌లో అధికారేట్లు వసూళ్ళు చేశారని కాంట్రాక్టర్ పై ఏమి చర్యలు తీసుకుంటున్నారని వైస్ ఛైర్మెన్ బంగారురెడ్డి ప్రశ్నించారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ వసూళ్లపై కమిటీ వేసి నిజ నిర్ధారణ జరిపామన్నారు. కాంట్రాక్టరుకు నోటీసులు ఇచ్చామ న్నారు. సమావేశంలో 11 అంశాల అంజెడాపై చర్చించి తీర్మానాలను ఆమోదించారు.

రైతులకు పవర్ స్ప్రేయర్లు పంపిణీ

మైలవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పర్యావరణ అనుకూల వ్యవసాయాన్ని ప్రోత్సహించడం వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి రైతులను అధునాతన సాధనాలతో శక్తివంతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని దాల్మియా యూనిట్ హెడ్ ముఖేష్ కుమార్ సిన్హా, హెచ్‌ఆర్ హెడ్ ఉమేష్ పేర్కొన్నారు. మంగళవారం దాల్మియా చుట్టు పక్క గ్రామాల రైతులకు పవర్ స్ప్రేయర్ల పంపులను అందజేశారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ ప్రతినిధులు, దాల్మియాఅధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నపల్లెకు రూ. 2 కోట్ల నిధులు మంజూరు

కొండాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపల్లె గ్రామానికి ఆర్ అండ్ ఆర్ క్రింద రూ.2 కోట్ల నిధులు మంజూరయినట్లు అధికారులు తెలిపారు. గండికోట ఎత్తిపోతల పథకంలో భాగంగా తిమ్మాపురం చెరువు క్రింద ముంపునకు గురి కానున్న చిన్నపల్లె గ్రామానికి ఈ నిధులు మంజూరయ్యాయి. గ్రామంలో 65 కుటుంబాలు ముంపునకు గురి కానున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఒక్కొక్క కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున రూ.6.5 కోట్లు నిధులు అవసరమవుతాయి. ఇందులో ప్రస్తుతం రూ.2 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసించి. దీంతో ప్రస్తుత నిధుల మేరకు ఒక్కొక్కరికి రూ.3,07,692ను వారి అకౌంట్లలో జమచేసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

విద్యార్థినులకు ఉచితంగా సివిల్స్ కోచింగ్

ప్రొద్దుటూరు అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలో సివిల్స్ మీద ఆసక్తి వుండి పోటీ పడి సాధించాలనే లక్ష్యంవున్న డిగ్రీ పూర్తయిన విద్యార్థినులకు ఉచితంగా సివిల్స్ కోచింగ్ అవకాశం కల్పిస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో సంస్కృతి సంస్థ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డితో కలిసి కొండారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ సహకారంతో నవంబరు 3న స్క్రీనింగ్‌పరీక్ష పెట్టి అందులో ఉత్తీర్ణులైన వారిని ఎంపిక చేసి సివిల్స్ ఉచిత కోచింగ్‌కోసం ఢిల్లీకి పంపిస్తామన్నారు. సివిల్స్‌పై ఆసక్తి వున్న విద్యార్థినులు 98856 09999, 99850 61155 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

రక్తదాన శిబిరం విజయవంతం

మైదుకూరు రూరల్ అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం నంద్యాల రోడ్డులోని ప్రభుత్వ ఆసుపత్రిలో మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈ శిబిరంలో సీఐ శివశంకర్ యాదవ్ పోలీసులు,ప్రజలు పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి డీఎస్పీ రాజేంద్రప్రసాద్ సర్టిఫికేట్ అందచేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కాశినాయన అక్టోబరు29 : ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలను రైతులు సద్విని యోగం చేసుకోవాలని ఏవో జయలక్ష్మీ, ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఇటుకలపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం, పెద్దకారు రైతులకు 70 శాతం సబ్సిడీతో ప్రభుత్వం డ్రిప్ సౌకర్యం కల్పిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఏఈవో ధనలక్ష్మీ,ఎంపీఈవో శశికళ పలువురు రైతులు పాల్గొన్నారు.

దువ్వూరు..: పంటల సాగులో మెలకువలు పాటించడం ద్వారా దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని ఏవో అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నేలటూరు, పెద్దజొన్నవరం గ్రామాల పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతులతోపాటు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

చాపాడు..: రైతులు పంటలకు తెగుళ్లు, చీడపీడలు ఆశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో మ్యాగీ కోరారు. అన్నవరం, మడూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి, మినుము పైర్లను పరిశీలించారు. పలు రకాల సూచనలు ఆమె రైతులకు ఇచ్చారు.

మైదుకూరు రూరల్..: అరటి,బొప్పాయి పంటలలో సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే పంట దిగుబడి చేతకందక నష్టపోతారని ఏవో ప్రసన్న కుమారి తెలిపారు.మండలంలోని ఆదిరెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం రైతుసేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



మైదుకూరు.. జీవామృతం తయారీ విధానాన్ని రైతులకు తెలియచేస్తున్న అధికారులు

జరిగింది.ఈ కార్యక్రమంలో అధికారులు సేంద్రీయ ఎరువుల ఆవశ్యకతను రైతులకు తెలియచేశారు.ఈ కార్యక్రమంలో ఏడీఏ క్రిష్ణమూర్తి రైతులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: మండల ంలోని రంగసముద్రం గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం అధికారి శైలజ, వ్యవసాయ పరిశోధన స్థానం సైంటిస్ట్ సునీల్ ఏవో వరహరి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో వారు పాల్గొని వరి, మొక్కజొన్న పంటలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీటీఎం శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

అమృతానగర్‌నుంచి మడూరుకు వెళ్లే రోడ్డును వెంటనే పూర్తి చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అమృతానగర్ నుంచి మడూరుకు వెళ్లే రోడ్డు అసంపూర్తిగా ఉందని, వెంటనే పూర్తి చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిఇన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమృతానగర్ నుంచి మడూరుకు వెళ్లే రోడ్డును సిమెంటుతో నిర్మించినా మధ్యలో కొంత భాగం నిలిపివేశారన్నారు. దీంతో అక్కడ వర్షం వచ్చినప్పుడు ఇబ్బందిగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శేఖర్, శివ, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు మున్సిపాలిటీకి రెండు అవార్డులు

బద్వేలుటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : వీధి విక్రయదారులకు రుణాలు ఇప్పించడం, కనీస వసతులు కల్పించడంలో బద్వేలు మున్సిపాలిటీ అవార్డులు పొందింది. ఇందులో ఒకటి జాతీయస్థాయి, మరొకటి రాష్ట్రస్థాయి అవార్డు పొందడం విశేషం. ఈ మేరకు పురపాలకశాఖా మంత్రి నారాయణ చేతులమీదుగా బద్వేలు మున్సిపల్ కమిషనర్ మంగళవారం అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బద్వేలు పట్టణంలో గతంలో మెప్మాసిబ్బంది కృషితోనే బద్వేలు మున్సిపాలిటీకి అవార్డులు దక్కాయన్నారు. అనంతరం మెప్మా సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ అభినందించారు.



అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ వెంకటనరసింహారెడ్డి

వాసవీ క్లబ్ జిల్లా అధ్యక్షుడిగా ముచ్చర్ల రాధాక్రిష్ణమూర్తి

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వీ206ఏ జిల్లాకు అధ్యక్షుడిగా ఇటీవల పుట్టపర్తిలో జరిగిన సమావేశంలో సభ్యులు ఎన్నుకోవడం జరిగిందని అధ్యక్షుడు ముచ్చర్ల రాధాక్రిష్ణమూర్తి తెలిపారు. అలాగే ఈ కమిటీలో సభ్యులుగా అనుముల వేణుగోపాల్‌శెట్టి, కార్యదర్శిగా పబ్బతి గోపాల్, కోశాధికారిగా పెండ్యాల విజయకుమార్, పరిటాల వెంకటరమణను ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన సభ్యులచేత ప్రమాణ స్వీకారాన్ని జిల్లా అధ్యక్షుడు (గవర్నర్) ముచ్చర్లరాధాక్రిష్ణమూర్తి ప్రమాణ స్వీకారాన్ని చేయించినట్లు ఆయన ఆయన తెలిపారు.



జిల్లా కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న అధ్యక్షుడు రాధాక్రిష్ణమూర్తి

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత సిలిండర్

బద్వేలు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర ప్రభుత్వం దీపావళి పండుగ రోజు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీచేసే కార్యక్రమం చేపట్టిందని ఆర్డీవో చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ పొందేందుకు విధివిధానాలు, అవసరమైన పత్రాలు దరఖాస్తు ప్రక్రియ వివరించారు. ఉచిత గ్యాస్ సిలిండర్ వలన అర్హులైన వెనుక బడిన వర్గాలకు ఉపయోగం చేకూరుతుందన్నారు. సంవత్సరంలో 3 సిలిండర్లను దశల వారీగా ఉచితంగా అందిస్తామన్నారు. గ్యాస్ డెలీవరి సమయంలో డెలివరి బాయ్‌కి ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని, ఉచిత గ్యాస్ పొందేందుకు ఆధార్, రేషన్ కార్డులు కలిగి ఉండాలన్నారు. త్వరలో అర్హుల జాబితా ప్రకటిస్తామన్నారు. అర్హులైన లబ్ధిదారులు ముందుగా డబ్బులు చెల్లించాలని, అనంతరం 48 గంటలలోపు లబ్ధిదారుని అకౌంట్‌లో ప్రభుత్వం డబ్బులు వేస్తుందన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో

టీడీపీతోనే భవిష్యత్తు : రితేశ్

బద్వేలుటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశంపార్టీతోనే ప్రతి ఒక్కరికీ బంగారు భవిష్యత్తు ఉంటుందని, ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని బద్వేలు టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేశ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని ప్రతి వార్డు నుంచి గ్రామస్థాయి వరకు కార్యకర్తలు చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వనమోదులో భాగస్వామ్యులు కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో దీవాళి విత్‌మై భారత్ కార్యక్రమంలో భాగంగా కూరగాయల మార్కెట్‌లో రోడ్లను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, సంస్కృతి సేవా సంస్థ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, శ్రీవెంకటేశ్వర డిగ్రీకళాశాల, వేదవ్యాస డిగ్రీ కళాశాల, రాణి తిరుమలదేవి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని మార్కెట్ పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు, విజయ్‌కుమార్, కళాశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.



రోడ్లను శుభ్రం చేస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున